ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

బుధవారం 10 సెప్టెంబరు 2025



పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌లో ప్రవహిస్తున్న కృష్ణమ్మ

జడ్పీ హైస్కూల్‌కు నిప్పు

- కాలిపోయిన సామగ్రి
- క్లూస్ టీంతో విచారణ



క్లూస్ టీం ద్వారా విచారణ చేస్తున్న పోలీసులు



పాఠశాలలో కాలిపోయిన సామగ్రి

వీరబల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీ చమర్తివాండ్లపల్లె జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పాఠశాలలోని విద్యుత్ వైర్లు, కొయ్యలు, ఫర్నీచర్, పాఠ్యపుస్తకాలు అన్నీ పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటనతో పాఠశాలకు భారీ నష్టం వాటిల్లింది. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర విచారణ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై రూరల్ సీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం క్లూస్ టీంతో విచారణ చేపట్టారు.

కోడూరు సబ్ డీఎఫ్‌వోకు పదోన్నతి

- చిత్తూరు డీఎఫ్‌వోగా నియామకం



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజోతి): చిత్తూరు డిస్ట్రిక్ట్ ఫారెస్టు అధికారి (డీఎఫ్‌వో)గా సుబ్బరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సబ్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్నారు. ఈయనకు పదోన్నతి ఇస్తూ చిత్తూరుకు బదిలీ చేశారు.

నేటి నుంచి పలు రైళ్లకు స్టాపింగ్



కొండాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు రైళ్లకు బుధవారం నుంచి స్టాపింగ్ పునరుద్ధరిస్తున్నట్లు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కరోనాకు ముందు స్టాపింగ్ ఉన్న కొన్ని రైళ్లు యథావిధిగా నడవనున్నట్లు తెలిపింది. ఈ నెల 10 నుంచి పూణే- కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెంబర్ 16381/16382) రైలు కొండాపురం, నందలూరులలో ఆగనుంది. తిరుపతి-కొల్హాపూర్ ట్రైన్ నెంబర్ (17415/ 17416) రాజంపేట, ఓబులవారిపల్లెలో, కాచిగూడ-చెంగల్‌పట్టు (ట్రైన్‌నెంబర్ 17652) కోడూరులో ఆగనుంది. అహ్మదాబాద్-చెన్నై (ట్రైన్ నెంబర్ 20953/ 20954) రైలు, అదేవిధంగా చెన్నై-ఛత్రపతి శివాజీ టెర్మినల్ (ట్రైన్ నెంబర్ 22157, 22158 22159), లోకమాన్యతిలక్- చెన్నై (ట్రైన్ నెంబర్ 12163), ముంబై-నాగర్‌కోయిల్ (ట్రైన్ నెంబర్ 16351/16352) ఈ రైళ్లన్నింటికీ రాజంపేట, కోడూరు స్టేషన్లలో స్టాపింగ్ ఇచ్చారు. ఈ నెల 13 నుంచి తిరుపతి-ఔరంగాబాద్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెంబర్ 17622) రైలుకు ఎర్రగుంట్ల స్టేషన్‌లో స్టాపింగ్ ఇస్తున్నట్లు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

చెప్పిందే కొలత.. పల్లెవాసి కలత

- సర్వేయర్లు లేకుండా స్వామిత్వ కార్యక్రమం
- సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు
- ఇప్పటికే జరుగుతున్న సర్వే 6


మట్టి తరలింపు అనుమతిపై నిషేధం

- ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు 6

అధిక యూరియా పంటకు అనర్థం 6

బిర బిరా కృష్ణమ్మ

- కుప్పానికి పరుగులు
- హంద్రీ-నీవా కాలువల్లో జలకళ
- సాగు, తాగునీటికి ఇబ్బంది లేనట్లే
- ప్రవాహాన్ని లెక్క కడుతున్న అధికారులు
- అన్ని చెరువులూ నింపేలా ప్రణాళిక



పీటీఎం వద్ద నాలుగు పంపులతో ఎత్తిపోస్తున్న కృష్ణా జలాలు



అంగళ్లు వద్ద కృష్ణా జలాల పరవళ్లు

రాయలసీమ రాళ్ల సీమ కాదు.. రతనాల సీమ అనే నానుడి అక్షరాలా నెరవేరుతోంది. అపర భగీరథుడు సీఎం చంద్రబాబునాయుడు అనుకున్న లక్ష్యం మేరకు హంద్రీ-నీవా కాలువను పూర్తి చేయించి కృష్ణా జలాలు పారిస్తున్నారు. ఎక్కడ శ్రీశైలం? ఎక్కడ కుప్పం?..సుమారు 750 కి.మీ. దూరం నుంచి కుప్పానికి కృష్ణమ్మను తీసుకెళ్తున్నారు. కృష్ణా జలాల గలగలలు, పరవళ్లు చూసిన రైతులు, ప్రజలు హారతులిస్తూ పండుగ వాతావరణంలో స్వాగతం పలుకుతున్నారు.



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న హంద్రీ-నీవా ఈఈ రాజగోపాల్

మదనపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువకు కృష్ణాజలాలు రావడంతో రానున్న రోజుల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని రైతులు, ప్రజలు ఆనందంలో ఉన్నారు. కాలువ వెంబడి లైనింగ్ పనులు కూడా 75 శాతం పూర్తి కావడంతో నీటి ప్రవాహం వేగంగా సాగుతోంది. మొదటగా కుప్పం నుంచి చెరువులు నింపుకుంటూ క్రమంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని చెరువులు నింపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఎక్కడా కృష్ణా జలాలు దారి మళ్లకుండా, చుక్కనీరు వృథా కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఆఖరి చెరువు వరకు నీటిని తీసుకెళ్లేలా కూటమి ప్రభుత్వం దృష్టి సారించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హంద్రీ-నీవా ప్రధాన కాలువ నుంచి పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు ఆధారమైన చెర్లోపల్లెకు 500 క్యూసెక్కులు ప్రవాహం వస్తుండగా, అక్కడి నుంచి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ మొదలయ్యే 75 కి.మీ. వద్ద ఔట్‌ఫ్లో 350 క్యూసెక్కుల ప్రవాహం ముందుకొస్తోంది. ఇందులో చెర్లోపల్లెకు ముందు భాగాన ఎనిమిది, ఆ తర్వాత పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌పై మరో ఎనిమిది ఎత్తిపోతల పథకాలు (సంపులు) ఉన్నాయి. ప్రతి సంపులోనూ నాలుగు మోటార్లు ఉన్నాయి. నీటి ప్రవాహం, కాలువ పరిస్థితిని బట్టి ప్రతిచోటా మూడు లేదా నాలుగు మోటార్లూ పనిచేస్తున్నాయి. ఇలా సత్యసాయి జిల్లాను దాటి అన్నమయ్య జిల్లా పీటీఎం మండలంలో ప్రవేశానికి 300 క్యూసెక్కుల ప్రవాహం ఉంటోంది. అలాగే కుప్పం బ్రాంచ్ కెనాల్ మొదలయ్యే పెద్దపంజాణి మండలం అప్పినపల్లె వద్ద 220 క్యూసెక్కులతో ప్రవాహం మొదలై, కుప్పానికి 170 క్యూసెక్కులు ప్రవాహం కొనసాగుతోంది. ఇలా ఇప్పటికే కుప్పంలోని పరమసముద్రం చెరువు నిండిపోగా, కుప్పం సమీపంలోని వీరప్పనాయుని చెరువుకు నీటిని మళ్లించారు.

కాలువ వెంబడి కృష్ణా జలాలు దారి మళ్లకుండా హంద్రీ-నీవా అధికారులు ఎన్నడూ లేని విధంగా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంపు, సంపునకు మధ్యలో నీటి ప్రవాహాన్ని లెక్క కడుతున్నారు. కాలువ మొదట్లో ప్రవేశించే నీటి బొట్టు చివరి వరకూ సాగేలా దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా ఎక్కడా లీకేజీలు, కాలువ డ్యామేజీ లేకుండా ముందుజాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాలువ వెంబడి ప్రవహిస్తున్న నీటిని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ప్రవాహంలో, ఆవిరి రూపంలో సగటున కి.మీ. దూరానికి ఒకటి నుంచి ఒకటిన్నర క్యూసెక్కులు నష్టం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ నష్టాన్ని మరింత తగ్గించే ప్రయత్నంలో భాగంగా ఎస్కేప్ పాయింట్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని హంద్రీ-నీవా ఎస్ఈ విఠల్‌ప్రసాద్, ఈఈ రాజగోపాల్‌లు క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఆదేశాలిస్తున్నారు.

హంద్రీ-నీవా చరిత్రలో మొదటిసారిగా కుప్పానికి కృష్ణా జలాలు తీసుకెళ్లడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. ఇందులో భాగంగా కాలువ వెంబడి చెరువులను నింపుతున్నారు. ఈ క్రమంలో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 0.620 టీఎంసీల సామర్థ్యం గల మొత్తం 110 చెరువులు నింపాలని నిర్ణయించారు. పుంగనూరు నియోజకవర్గంలోని 1.35 టీఎంసీల సామర్థ్యంతో 41 చెరువులు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని రెండు టీఎంసీల సామర్థ్యంతో వంద చెరువులు నింపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే మొదటగా చివరనున్న కుప్పం నుంచి క్రమంగా పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన చెరువులను కృష్ణా జలాలతో నింపనున్నారు. కాలువలో ప్రవాహం గంటకు 1.50 కి.మీ. సాగుతోంది. ఈసారి వర్షాలు ముందుగా మొదలు కావడం, చెర్లోపల్లెలో ఇప్పటికే నిలువ ఉన్న నీటిని ముందుగా వదలడంతో లక్ష్యాన్ని చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మూడు నెలలు లేదా అన్ని పరిస్థితులు అనుకూలిస్తే జనవరి వరకు ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జీడిపల్లె రిజర్వాయర్ నుంచి వచ్చే నీటితో చెర్లోపల్లెను ఎప్పటికప్పుడు నింపుతూ ఇక్కడ ఎంపిక చేసిన చెరువులను నింపుతామని హంద్రీ-నీవా అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ఈసారి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

- వీరబల్లిలో జగన్‌మోహన్‌రాజుకు బ్రహ్మరథం



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్‌మోహన్‌రాజు



వీరబల్లిలో ప్రజలు, కార్యకర్తలతో ర్యాలీగా వస్తున్న దృశ్యం

వీరబల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని నాయకులు, కార్యకర్తలకు రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపునిచ్చారు. టీడీపీ ఇన్‌చార్జ్ హోదాలో మొట్టమొదటిసారిగా వీరబల్లి మండలానికి వచ్చిన జగన్‌మోహన్‌రాజుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. మట్లి పంచాయతీ నుంచి రోడ్డు మార్గాన వీరబల్లికి ర్యాలీగా వచ్చారు. మండల పరిధిలో మట్లి వడ్డెపల్లి, యల్లంపల్లిల్లో ఆ గ్రామ సర్పంచ్ నాగార్జునాచారి ఆధ్వర్యంలో భారీ గజమాలతో స్వాగతం పలికారు. పెద్దివీడు మంగళపల్లి నేలరాళ్లపల్లెలో ఆ గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం వీరబల్లిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోవు స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందడానికి బలమైన నాయకత్వంతో ముందుకు వెళ్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలను వేధించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. సామాన్యుడు టీడీపీలో ఒక నాయకుడిగా ఎదగవచ్చని, నేను కూడా సామాన్య కార్యకర్త నుంచి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. అనంతరం మండల టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి మండల సమస్యలపై ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, సురేందర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, కల్లూరి రాంమోహన్‌రెడ్డి, అమరేశ్వర్‌రాజు, భాస్కర్‌రాజు, సిద్దిరాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టమోటా నారు... నెల దాటితే నేలపాలు 6

యూరియా, విత్తనాలు

అందుబాటులో ఉంచాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసనలో వైసీపీ నాయకులు



కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రైతులకు యూరియా, విత్తనాలు అందుబాటులో ఉంచాలని వైసీపీ నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతన్నకు బాసటగా అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్‌కు తరలివెళుతున్న యూరియాను అరికట్టాలని, రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి గిట్టుబాటు ధర కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లా పరిశీలకుడు, కడప మేయర్ సురేశ్‌బాబు, మదనపల్లె సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్, రాజంపేట ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలపై ఫిర్యాదు చేయండి

- ప్రైవేటు షాపుల వద్ద వీఆర్‌వోలను ఉంచుతాం
- జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదు
- అవసరాలకు మించి వాడితే అనర్థం : కలెక్టర్



రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ములకలచెరువు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియాను అధిక ధరకు విక్రయించినా, మందులు కొంటేనే యూరియా ఇస్తామని చెప్పినా వెంటనే 08561 293006 నెంబర్‌కు రైతులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మండలంలోని సోంపల్లె సమీపంలో మంగళవారం నానో యూరియా, జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా విక్రయించే ప్రైవేటు దుకాణాల వద్ద పర్యవేక్షణ కోసం వీఆర్‌వోలను ఉంచుతామన్నారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచామన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో 57 వేల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా కేవలం 10,600 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారన్నారు. జిల్లాలో ప్రస్తుతం 25 వేల బస్తాల యూరియా రైతులకు అందుబాటులో ఉందని, జిల్లాలో రైతులకు ఇప్పటి వరకు అవసరాలకు మించి 4 వేల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని, అవసరమైతే మరిన్ని టన్నుల యూరియాను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎవరైనా అధిక ధరకు యూరియా కొనుగోలు చేసినట్లు సాక్ష్యాలు చూపిస్తే అమ్మిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యూరియా అధిక మోతాదులో వాడడం వలన భూమిలో సారం తగ్గిపోయి భవిష్యత్తు తరాలకు నష్టం కలుగుతుందన్నారు. భవిష్యత్తులో యూరియా వాడకాన్ని తగ్గించి సహజ ఎరువులు, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. సహజ పద్ధతుల ద్వారా నేల సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ శివనారాయణ, మదనపల్లె సబ్‌కలెక్టర్ కళ్యాణి, డీహెచ్‌వో సుభాషిణి, తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో హరినారాయణ, ఏవో స్రవంతి, మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు పీర్‌బాషా, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు కలెక్టర్ అభినందన

మండలంలోని వేపూరికోటకు చెందిన రైతు అశోక్‌కుమార్‌ను కలెక్టర్ శ్రీధర్ అభినందించారు. కలెక్టర్ పిలుపు మేరకు టమోటాకు బదులు ఐదు ఎకరాల్లో బంతి పూలు సాగు చేసి రూ.10 లక్షలు ఆదాయం పొందానని రైతు చెప్పాడు. సదస్సులో కలెక్టర్ రైతును ప్రశంసిస్తూ ఇతర రైతులు కూడా ఇలాంటి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు.

సంపద సృష్టి తయారీ కేంద్రం తనిఖీ

మండలంలోని సోంపల్లెలో ఉన్న చెత్త నుంచి సంపద సృష్టి తయారీ కేంద్రాన్ని కలెక్టర్ శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెత్త సేకరణపై ఆరా తీశారు. చెత్త సేకరణ ఏ గ్రామంలో చేపట్టారో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డిని అడిగి తెలుసుకుని నేరుగా అడివిచెరువులో గ్రామానికి వెళ్లారు. అక్కడ ఇంటింటికి చెత్తసేకరణపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో చెత్తసేకరణ జరగడం లేదని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు నెలలుగా ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరణ చేయమని చెబుతున్నా నిర్లక్ష్యం వహించడంపై కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పీపీపీలో మదనపల్లె మెడికల్ కాలేజీ

- జీవో విడుదల చేసిన ప్రభుత్వం



ఆరోగ్యవరం వద్ద నిలిచిపోయిన మదనపల్లె మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలను పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానంలో నిర్మించి, నిర్వహణ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్-590ను మంగళవారం విడుదల చేసింది. ఇందులో మదనపల్లె మెడికల్ కాలేజీ కూడా ఉంది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం అందులో ఎంబీబీఎస్ కోర్సులు, బోధనాస్పత్రులను ఏర్పాటు చేయాలని 2020 సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం జీవో విడుదల చేసి మెడికల్ కాలేజీ నిర్మాణానికి రెండేళ్లలో కేవలం రూ.65 కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం, నాబార్డు నిధులు 50 శాతం విడుదల కాకపోవడంతో టెండర్లు దక్కించుకున్న మెగా సంస్థ అనుకున్న గడువులో నిర్మాణాలు పూర్తి చేయలేదు. అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణం సందిగ్ధంలో పడింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కేపీఎంజీ కన్సల్టెన్సీ ద్వారా పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీ నిర్మాణాలు పూర్తి చేసి, ఎంబీబీఎస్ కోర్సు బోధనలు, ప్రజలకు వైద్యసేవలందించాలని నిశ్చయానికి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అంతేకాకుండా ఈ మెడికల్ కాలేజీ నిర్వహణకు వార్షిక కన్సెషన్ ఫీజు విధానం కింద ఔత్సాహిక కాంట్రాక్టర్లు బిడ్ వేయొచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. పీపీపీ విధానం కింద మదనపల్లె మెడికల్ కాలేజీని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని, వీటిపై ఫీజిబిలిటి, ఆర్థిక అంశాలను, ముసాయిదా ఆర్ఎఫ్‌పీ ఒప్పందాలను పరిశీలించి సక్రమంగా సమర్పించాలని ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌ను కోరుతూ ఉత్తర్వులు విడుదల చేశారు.

స్వామిత్వ సర్వేను పూర్తి చేయండి: డీపీవో


గుర్రంకొండలో స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ రాధమ్మ

గుర్రంకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ సిబ్బందికి సూచించారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె, గుర్రంకొండ గ్రామాల్లో మంగళవారం స్వామిత్వ సర్వేను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించి వివరాలను సేకరించారు. ఇందులో భాగంగా టి.పసలవాండ్లపల్లె పంచాయతీ పరిధిలో స్వామిత్వ సర్వే తీరు సరిగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై మండిపడ్డారు. పట్టణంలో సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని, రోగాలు వ్యాపించ కుండా తగు జాగ్రత్తలను పాటించాలన్నారు. సచివాలయాల సిబ్బంది విధులపట్ల ఆలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శులు శ్రీహరి, నిస్సార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులతో దురుసుగా ప్రవర్తించొద్దు

● డీఎంహెచ్‌వో నాగరాజు


పి.కొత్తపల్లె పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సిద్దవటం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని కడప డీఎంహెచ్‌వో నాగరాజు సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డు కలిగి ఉండాలని, డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. కాన్పులవార్డు, రోగుల గదులు, వ్యాక్సినేషన్ సంబంధించిన గదులను తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్య పరిరక్షణపై పంచాయతీ కార్యదర్శులకు శ్రద్ధ తీసుకునేలా చూడాలన్నారు. 104 శిబిరాలకు వచ్చే పేషంట్ల రక్త నమూనాలు సేకరించాలని, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రంగలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మట్టి తరలింపు అనుమతులు నిషేధం

● ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు

కురబలకోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువుల నుంచి మట్టి తరలింపుపై అనుమతులను నిషేధించినట్లు ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కనున్న రియల్ ఎస్టేట్ భూముల అభివృద్ధికి వ్యవసాయ భూముల పేరుతో మట్టి తరలింపులో ఇరిగేషన్ అధికారులను బురిడీ కొట్టించి అనుమతులను పొంది చింతమాకులపల్లె పంచాయతీ నార్లపల్లె చెరువు నుంచి మట్టిని తరలించిన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతిలో మట్టి మాఫియా బరితెగింపు, మట్టి తరలింపులో బురిడీ శీర్షికన కథనాలు ప్రచురితమైంది. కాగా దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చెరువులను నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో చెరువుల నుంచి మట్టిని తోలుకోవడానికి అనుమతులను రద్దు చేశామన్నారు. నార్లపల్లె చెరువులో మట్టిని తోలుకోవడానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు.

టపాసులు పేలి టీ కొట్టుకు నిప్పు

వీరబల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు వీరబల్లికి విచ్చేసిన సందర్భంగా స్థానిక బస్టాండు ఆవరణలో నేతలు టపాసులు పేల్చారు. దీంతో నిప్పురవ్వలు ఎగసి పడడంతో టీ కొట్టు 60 శాతానికి పైగా కాలిపోయింది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కాగా, ఈ ప్రమాదంతో జీవనాధారం కోల్పోయానని, తనను ఆదుకోవాలని టీకొట్టు యజమాని కరీముల్లా కోరుతున్నాడు.

టమోటా నారు... నెల దాటితే నేలపాలు


నెల దాటడంతో పడేసిన టమోటా నారు

● నారు నర్సరీలపై అకాలవర్షాల ప్రభావం

● లబోదిబోమంటున్న నర్సరీల యాజమాన్యం

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట సాగులో ఆధునిక పద్ధతిలో రెడీమేడ్ విధానాన్ని అందించేవి నారు నర్సరీలు. నర్సరీలలో ప్రధానంగా టమోటా, వంగ, మిరప నారు పిలకలతో పాటు పూల మొక్కల బంతి, చామంతి మొక్కలు పెంచుతూ ఉంటారు. అయితే జిల్లాలో ప్రధానంగా రాయచోటి, తంబళ్లపల్లి, మదనపల్లె, పీలేరు, కలికిరి నియోజకవర్గంలో టమోటా సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. ఒకప్పుడు టమోటా పంట సాగు కోసం రైతులు నారుమళ్లు తయారు చేసి విత్తనాలు పోసి నారుమడి చుట్టూ పాత చీరలతో కట్టి చుట్టూ ఎత్తయిన రాళ్లతో, టెంకాయ పట్టలతో పందిరి వేసేవారు. 30 నుంచి 45 రోజుల పాటు ప్రతిరోజూ నీరు పోసి నారు సిద్ధం చేసుకునేవారు. దీంతో చాలా ఆలస్యమయ్యేది. అయితే వ్యవసాయంలో మార్పులు రావడంతో నారు నర్సరీలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. సులువైన పద్ధతిలో పంటసాగు జరుగుతుంది. నారు పోసిన తర్వాత మొక్కకు నెల దాటితే అమ్ముడుపోని నారు నేలపాలు కావాల్సిందే అంటున్నారు నర్సరీ యజమానులు. వర్షాలు సకాలంలో కురిస్తేనే నర్సరీల యజమానులకు ఆదాయం ఉంటుందని, లేదంటే నష్టాలు తప్పవని అంటున్నారు. టమోటా నారు ఒక్కో పిలకపై రూ.55 పైసల నుంచి 65 పైసల ఖర్చు వస్తున్నట్లు తెలిపారు. ఒక పిలక ఒక్క రూపాయి అమ్మితే రూ.35 నుంచి 45 పైసలు ఆదాయం వస్తుందని నర్సరీల యజమానులు చెబుతున్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు పడకపోవడంతో నారు ముదిరి నేలపాలు చేసినట్లు తెలిపారు. ఒక నారు నర్సరీని బట్టి ఒక నెలలో రూ.8 నుంచి 9 లక్షలు టమోటా నారు వస్తున్నట్లు తెలిపారు. నష్టం రావడంతో లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.


నారు నర్సరీలో సిద్ధంగా ఉన్న టమోటా నారు

ఏడాదికి రెండుసార్లు సాగు

ఈ ప్రాంతంలో రైతులు ఏడాదిలో రెండుసార్లు టమోటా పంట సాగు చేస్తారు. మార్చి, ఏప్రిల్ నుంచి ఎండాకాలం వస్తే చాలు.. రాయచోటి నియోజకవర్గం ప్రాంతంలో కలకడ, సంబేపల్లె, చిన్నమండెం ప్రాంతాలకు చెందిన రైతులు ఎండ తీవ్రతలు అధికంగా ఉండడంతో పంట సాగు కోసం భాకరాపేట, మదనపల్లి, అంగళ్లు, బి.కొత్తకోట ప్రాంతాలకు వెళ్లి పొలం లీజుకు తీసుకుని పంట సాగు చేస్తారు. జూన్, జూలై నెల ఆఖరిలో వర్షాలు పడడంతో అక్కడ పంట పూర్తి చేసుకుని తిరిగి ఇక్కడ జూలై, ఆగస్టు నెలలో పంట సాగులకు సిద్ధం చేస్తారు. ఇలా ఏడాదిలో రెండుసార్లు పంట సాగు చేస్తూ నారు నర్సరీలపై ఆధారపడడంతో నారు నర్సరీ యజమానులకు వ్యాపారం జీవనాధారంగా మారింది.

టమోటా ధరల పతనంతో తగ్గిన సాగు

టమోటా సాగుపై ధరల ప్రభావం పడింది. రాయచోటి నియోజకవర్గంలో సుమారు 2 వేల హెక్టార్లలో టమోటా సాగు చేసేవారు. టమోటా ధరలు వరుసగా 7 నెలలుగా పడిపోవడంతో రైతులు పంట సాగుకు సుముఖత చూపకపోవడంతో పంట సాగు తగ్గిందనే చెప్పవచ్చు. దీంతో కూడా నారు నర్సరీ వ్యాపారంపై ప్రభావం పడింది.

ఈ ఏడాదీ నష్టమే

- సుబ్రమణ్యం, నారు నర్సరీ వ్యాపారి, దేవపట్ల, సంబేపల్లె మండలం



మా నర్సరీలో ఒకసారి 8 లక్షల టమోటా నారు వేస్తాం. ఈ ఏడాది ఒకసారి మాత్రమే నారు అమ్ముడు పోయింది. గతంలో ఏడాదికి రెండుసార్లు నారు అమ్ముడు పోయేది. జూన్, జూలై నెలల్లో వర్షాలు పడకపోవడంతో నారు అమ్ముడుపోలేదు. నారుకు నెల దాటితే ముదిరిపోతుంది. తర్వాత పడేయాల్సిందే. దీంతో నష్టమే. ఉద్యానశాఖ అధికారులు నర్సరీ యజమానులు నష్టాలను గుర్తించి ఆదుకోవాలి.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

● గ్రామ పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య


పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

పీలేరురూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాసి వెంకట్రామయ్య ఆరోపించారు. మంగళవారం పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలు గడుపుతున్న 46 మంది పంచాయతీ పారిశుధ్య కార్మికుల జీతాల్లో నెలకు రూ. 1000 చొప్పున తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. ఏవరూ చేయని పని చేస్తున్న కార్మికుల కడుపు కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే రూ. 13,500లలో రూ. వెయ్యి తగ్గిస్తే ఏమి తినాలి ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇదే విషయం డీపీఓ రాధమ్మ దృష్టికి తీసుకెళ్లగా ఇలా ఎవరు చేయమన్నారని ప్రశ్నించారని తెలిపారు. అయినా పంచాయతీ అధికారుల్లో ఎటువంటి చలనం కానరావడం లేదని తెలిపారు. గతేడాది ఏప్రిల్, మే నెలల జీతాలు 46 మంది కార్మికులకు ఇవ్వాలని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. ఇంకెప్పుడిస్తారో అంతా అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. ప్రతి నెలా పంచాయతీ కార్మికులను 300 గ్రాముల కొబ్బరి నూనె, రెండు సోపులు ఇస్తారని, ఎనిమిది నెలలుగా నూనె, సోపులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఒక్కొక్కరి పీఎఫ్ ఖాతాలో ఆరు నెలల డబ్బు జమ చేయకుండా పెండింగ్ పెట్టారని, వీటిని ఎప్పుడు జమచేస్తారో ఎవరిని అడిగినా సరైన సమాధానం చెప్పడంలేదని వాపోయారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబించడం శోచనీయమని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించకపోతే తమ ఆందోళన కార్యక్రమాలను అందరి సంఘీబావంతో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్మికులకు 2025-2026కు యూనిఫాం సత్వరం ఇవ్వాలని ఏప్రిల్‌లో పంచాయతీ బోర్డు ఆమోదం తెలిపినా ఇప్పటి వరకూ ఇవ్వలేదన్నారు. మూడు పూటలూ గడవడం గగనమైన పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన నూనె, సోపులు, దుస్తులు, పెండింగ్ జీతాలు, పీఎఫ్ తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు బీ.వీ.రమణ, పులి రెడ్డెప్ప, నాగార్జున, రమేష్, చిట్టెమ్మ, రాణెమ్మ, రాజేశ్వరి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యం సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగా పదోన్నతులు

కలికిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం పొన్నూలు కొత్తపల్లె పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ జె.ప్రవీణ్ కుమార్‌కు కంటి వైద్యం సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతి కల్పించారు. కడప ఎన్‌పీసీబీ సంచార కంటి వైద్యం యూనిట్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డీపీఎంఓగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.రియాజ్‌బేగ్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా పదోన్నతి కల్పించి చిత్తూరు జిల్లా వైద్యశాలకు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

12న అండర్-19 ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 12వ తేదీన శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 ఫుట్‌బాల్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు నాగరాజ, ఝాన్సీ, డాక్టర్ బాబు, సరిత, కిషోర్, భార్గవి తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆరో తరగతి నుంచి ఇంటర్ మధ్య చదువుతుండాలన్నారు. 2007 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. తమ వెంట ఇంటర్ చదువుతున్న వారు టెన్త్ ఒరిజనల్ సర్టిఫికెట్లు, క్రీడా యూనిఫామ్స్‌తో సెలక్షన్‌లో పాల్గొనాలని సూచించారు.

ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓగా సునీల్

కలికిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అటవీ శాఖ సబ్ డీఎఫ్ఓగా గరుడ్ సాంకేత్ సునీల్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2023 ఐఎఫ్ఎస్ అధికారి అయిన సాంకేత్ శిక్షణ ముగించుకోవడంతో ఆయనను ప్రొద్దుటూరులో నియమించారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాళీశ్వరస్వామి కొండలో క్లూస్ టీమ్


ఆలయ ముఖద్వారం పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

రామసముద్రం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె గ్రామ పంచాయతీ బల్లసముద్రం వాళీశ్వర స్వామి కొండలో మంగళవారం మదనపల్లె క్లూస్ టీమ్ పోలీస్ అధికారులు వేలిముద్రలు, ఆధారాలను సేకరించారు. వాళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం గుప్తనిధుల కోసం ఆలయాన్ని ధ్వంసం చేసిన సంగతి విధితమే. ఆలయ అర్చకులు లోకనాథ్ దీక్షిత్, ఈఓ రమణ, పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పందించిన రామసముద్రం ఎస్ఐ రమేష్ బాబు ఆదేశాలతో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించడానికి వచ్చి కొండలో అణువు అణువు పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, అర్చకులు లోకనాథ్ దీక్షితులు, కానిస్టేబుల్ పురుషోత్తం, నల్లప్పగారి పల్లె గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భూములను సద్వినియోగం చేసుకోండి


దేవదాయశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న బి.కొత్తకోట నేతలు

బి.కొత్తకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల గంగమ్మ మాన్యం భూములను సద్వినియోగం చేసుకొని ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా దేవదాయశాఖ అధికారులకు బి.కొత్తకోట బీజేపీ నేతలు విన్నవించారు. మంగళవారం జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన వీరు మాట్లాడుతూ పట్టణంలోని బెంగళూరు రోడ్డులో రూ.కోట్ల విలువైన వాణిజ్య భూములను ఏళ్ల తరబడి గంపగుత్తగా నామమాత్రపు అద్దెకు ఇచ్చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ ముకుందబాబు, రమేష్, మురళి, రాము, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అధిక యూరియా పంటకు అనర్థం

● జిల్లా వ్యవసాయాధికారి శివన్నారాయణ


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివన్నారాయణ తదితరులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరితో పాటు ఏ పంటకైనా అధిక మోతాదులో యూరియా వినియోగం అనర్థదాయకమని జిల్లా సంచాలకులు శివన్నారాయణ పేర్కొన్నారు. మంగళవారం కోటావూరు గ్రామంలో తోటి అధికారులతో కలిసి పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. యూరియా అధికమోతాదుతో నేలలో క్షార శాతం పెరిగిపోతుందని, భూమి నిస్సారం అవుతుందన్నారు. దానికి బదులు సంప్రదాయ పద్ధతులను అవలంబించి, సారవంతమైన ఎరువులను ఉపయోగించి, రసాయన ఎరువుల వాడకాన్ని క్రమక్రమంగా తగ్గించాలన్నారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకుల్లో పంటరుణాలు ఇచ్చి తీరాలని, అలా కాకుండా ఏ బ్యాంకు శాఖలోనైనా ఇవ్వకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మనుషుల ఆధార్ లాగే పశువులకు కూడా గుర్తింపుకార్డును ఇస్తున్నామని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ రాయితీలను పొందాలన్నారు. పలువురు రైతులు తమ సమస్యలను జిల్లా అధికారులకు వన్నవించారు. కార్యక్రమంలో బి.కొత్తకోట ఏఓ చంద్రశేఖర్, సచివాలయాల వ్యవసాయశాఖ ఉద్యోగులు మల్లికార్జున, అంజి, సునీత తదితరులు పాల్గొన్నారు.

చెప్పిందే కొలత.. పల్లెవాసి కలత

● సర్వేయర్లు లేకుండా స్వామిత్వ కార్యక్రమం

● సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

● ఇప్పటికే జరుగుతున్న సర్వే


సర్వేయర్ లేకుండా కొలతలు తీస్తున్న పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్


కొలతల పూర్తి వివరాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి

సుండుపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ శాతం గ్రామాల్లో ఇప్పటికీ తమ నివాసాలకు ఆస్తి పత్రాలు లేక, కొలతలు తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను చక్కదిద్దేందుకు స్వామిత్వ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్, ఇంజనీరింగ్, డిజిటల్ సహాయకులు బృందంగా వెళ్లి సర్వే చేపట్టాలి. కానీ సుండుపల్లె మండలంలో ప్రస్తుతం జరుగుతున్న స్వామిత్వ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే వెళ్లి సర్వే చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో లోపభూయిష్టంగా జరుగుతున్నట్లు గ్రామీణులు ఆరోపిస్తున్నారు.

రోవర్లు ఉపయోగించకుండా

ప్రధానంగా ఇళ్ల స్థలాలకు కొలతలు వేసే సమయంలో రోవర్లు ఉపయోగించాలి. అవి లేకుండా ప్రక్రియ సాగుతోంది. టేపులతో కొలతల వల్ల తమ ఆస్తులకు సంబంధించి తేడాలు వస్తాయని పలువురు చెబుతున్నారు. వీఆర్‌వోలు ఇతర పనుల పేరుతో సరిగ్గా హాజరుకాకపోవడం, అసలు సర్వేయర్లు కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో ఖాళీ స్థలాలకు హద్దులు తెలియక ఇంటి యజమాని ఏది చెబితే అదే పరిగణలోకి తీసుకుంటున్నారు. దాంతో గ్రామాల్లో వివాదాలు తెలెత్తే అవకాశాలు ఉన్నాయి. సుండుపల్లె, పెద్దినేనికాలువ, చిన్నగొల్లపల్లి, పొలిమేరపల్లె, భాగంపల్లితో పాటు మరికొన్ని గ్రామ పంచాయతీల్లో స్వామిత్వ సర్వే జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి లోపాలు సవరించి సర్వే సక్రమంగా సర్వేయర్లతో జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అనుభవం లేని వారికి బాధ్యతలు

కేంద్రం పంచాయతీరాజ్‌శాఖ పల్లెల్లో స్వామిత్వ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పథకానికి సంబంధించి ఇంటింటా కొలతలు వేయాలన్నా, రికార్డుల్లో నమోదు చేయాలన్నా సర్వేయర్ పాత్రే కీలకం. అలాంటి వారు లేకుండా అనుభవం లేని గ్రామ సహాయక ఇంజనీర్లకు బాధ్యతలను అప్పగించారు. దాంతో కొలతలు తీయడంలో లోపాలు తలెత్తుతున్నాయి. కొందరు అనుభవం ఉన్న సర్వేయర్లను పక్కన బెట్టారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో సాగాల్సిన అభివృద్ధి పనుల్లో నిమగ్నం కావాల్సిన ఇంజనీరింగ్ సహాయకులు ఆ పనులను పక్కనబెట్టి అనుభవం లేని సర్వే పనులకు వెళ్తున్నారు. దాంతో పనులు ఆగిపోతున్నాయని పీఆర్ అధికారులు లబోదిబోమంటున్నారు.

సమస్య వస్తేనే సర్వేయర్లు

- రాధమ్మ, డీపీవో

సమస్య వస్తే సర్వేయర్లు వచ్చి కొలిచి సమస్య పరిష్కరిస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు వచ్చి పొడవు, వెడల్పు నమోదు చేస్తున్నారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాము.

కోడిగాండ్లపల్లెలో విజృంభిస్తున్న విషజ్వరాలు

- ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసినా.. అదుపులోకి రాని వైనం
- కర్నూలు, తాడిపత్రి, ప్రొద్దుటూరు ఆసుపత్రుల్లో చికిత్స
- గండికోట బ్యాక్‌వాటర్‌తోనే సమస్య


కోడిగాండ్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న గండికోట బ్యాక్‌వాటర్

ముద్దనూరు సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోడిగాండ్లపల్లెలో విషజ్వరాలు రోజు రోజుకు విజృంభిస్తున్నాయి. వైద్యాధికారులు గ్రామంలో పర్యటించి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన జ్వరాలు అదుపు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ గ్రామంలో 20 రోజులుగా విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. దాదాపు 30 నుంచి 40 మంది పిల్లలు జ్వరాల బారిన పడ్డారు. 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఎక్కువగా జ్వరాలు వస్తున్నాయి. చాలా మంది పిల్లలకు రక్త కణాలు తగ్గిపోతుండటంతో డెంగ్యూ జ్వరాలు వస్తు న్నాయి. దీంతో కొందరు ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, మరికొందరు కర్నూలు, ప్రొద్దుటూరు, తాడిపత్రిలలోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. కాగా, గత కొద్ది రోజుల నుంచి గ్రామంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో, మలేరియా అధికారులు, మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నా జ్వరాలు అదుపు చేయలేని పరిస్థితులు ఉన్నాయి. గండికోట బ్యాక్ వాటర్ గ్రామానికి అతీసమీపంలో ఉండటంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలతో పాటు వైద్యాధికారులు చెబు తున్నారు. కొద్ది రోజుల క్రితం ఓ చిన్నారి విషజ్వరంతో మృతి చెందినట్లు ప్రజలు చెబుతున్నారు. గ్రామంలో ఉన్నతాధికారులు పర్యటించి తమను జ్వరాల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాక్‌వాటర్‌తోనే సమస్య



మాగ్రామం సమీపంలో గండికోట డ్యాం బ్యాక్‌వాటర్ నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. పిల్లలకు దోమలు కుట్టడంతో జ్వరాలు వస్తున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలి.
మౌనిక, కోడిగాండ్లపల్లె

ఏడుగురికి డెంగ్యూ

కోడిగాండ్లపల్లెలో విషజ్వరాలు ఉన్నాయి. 13మంది తీవ్రజ్వరంతో బాధపడుతున్నారు. పరీక్షలు చేయగా ఏడుగురికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. తాడిపత్రి, కర్నూలు ప్రాంతాల్లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇద్దరు రికవరీ అయ్యారు. గ్రామానికి అతిసమీపంలో గండికోట బ్యాక్ వాటర్ నిల్వ ఉంది. గ్రామంలో నీటి తొట్టిలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండటం వల్ల లార్వా చేరుతుంది. ఎరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచనలు ఇచ్చాం. మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నాం.
-గీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో




ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి

కొమ్మినేని శ్రీవిద్యకు గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కొమ్మినేని శ్రీవిద్య

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్, ప్రముఖ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొమ్మినేని వెంకటసుబ్బయ్య కుమార్తె కొమ్మినేని శ్రీవిద్య ఎమ్మెస్ ఈఎన్‌టీలో రాష్ట్రస్థాయి ప్రథమర్యాంకు సాధించారు. మూడు బంగారు పతకాలు, అవార్డులు కూడా సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె కడప రిమ్స్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా కొనసాగుతున్నారు. మంగళవారం విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో వార్షికోత్సవం పురస్కరించుకొని గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా మూడు గోల్డ్‌మెడల్స్, రెండు ప్రజెంటేషన్స్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్‌చాన్సెలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్ వేమిరెడ్డి పాల్గొన్నారు. కొమ్మినేని శ్రీవిద్య గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల బండి బాబుమూర్తి, బాలకృష్ణ, బండారు సత్య, అప్పిశెట్టి వెంకటేశ్వర్లు, పీఎస్ ఇంతియాజ్ అహ్మద్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్.ఓ.సి. నెం. 1448 / 2011-ఎ1 — తేది : 09.09.2025

ప్రొద్దుటూరు పురపాలక సంఘము

టెండర్- కం- బహిరంగ వేలం ప్రకటన

ప్రొద్దుటూరు పురపాలక సంఘమునకు చెందిన అనిబిసెంట్ మునిసిపల్ హైస్కూల్ గ్రౌండ్ నందు 2025 సంవత్సరము సెప్టెంబర్, అక్టోబర్ మరియు నవంబర్ నెలలలో దసరా నవరాత్రులు ప్రారంభించిన తేది నుండి 45 రోజుల పాటు ఎగ్జిబిషన్ నిర్వహించుటకుగాను గుత్త హక్కుకై తేది 12.09.2025 శుక్రవారము ఉదయం 11.00 గంటల నుండి టెండర్ - కం - బహిరంగ వేలము మునిసిపల్ ఆఫీసు నందు జరుపబడును.

టెండర్ - కం - బహిరంగ వేలంలో పాల్గొను పాటాదారులు ప్రస్తుతం అమలులో వున్న గజిట్‌లోని నియమ నిబంధనలకు లోబడి ఉండవలెను.

వేలమునకు ముందుగా ఈ క్రింద తెలిపిన వేలపు ధరావత్తు చెల్లించవలెను మరియు ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించవలెను.

వ. నెం.	గుత్త వివరములు	గుత్త కాలము	వేలమునకు ముందు చెల్లించ వలసిన ధరావత్తు (రూపాయలు)	స్థానిక బ్యాంకు గ్యారంటి పత్రం (60 రోజులకు)
1	2	3	4	5
1	అనిబిసెంట్ మునిసిపల్ హైస్కూల్ గ్రౌండ్ నందు ఎగ్జిబిషన్ నడుపుకొనుటకు	45 రోజులు (సెప్టెంబర్, అక్టోబర్ మరియు నవంబర్ నెలలలో దసరా నవరాత్రులు ప్రారంభించిన తేది నుండి)	25,00,000/-	ఖరారు చేసిన హెచ్చు టెండర్ / వేలము పాట మొత్తంనకు

మిగతా వివరములకు మునిసిపల్ ఆఫీసు పనివేళలో రెవిన్యూ సెక్షన్‌లో తెలుసుకొనవచ్చును మరియు గజిట్ కాపీ పొందదలచిన వారు తగిన రుసుము చెల్లించి పొందవచ్చును.

సం/- కమీషనరు
ప్రొద్దుటూరు పురపాలక సంఘము

టిప్పరు ఢీకొని యువకుడి మృతి



ఖాజీపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో స్కూటర్‌ను టిప్పర్ ఢీకొన్న సంఘటనలో కె.వెంకటసుబ్బయ్య (21) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అల్లాడుపల్లె వద్ద జరుగుతున్న ఐటీఐ నిర్మాణ పనుల కోసం నాగసానిపల్లె నుంచి మట్టి తీసుకెళ్లేందుకు వస్తున్న టిప్పర్ అయ్యప్పస్వామి గుడి సమీపంలోకి రాగానే స్కూటర్‌ను ఢీకొంది. దీంతో వెంకటసుబ్బయ్య బ్రిడ్జిపై నుంచి కింద పడటంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే సిబ్బంది రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతను చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

లారీ ఢీకొని వృద్ధుడు...

చాపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద మైదుకూరు-ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లెక్కల లక్ష్మిరెడ్డి (64) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సోమాపురం గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి మైదుకూరు నుంచి సోమాపురానికి మోటారు సైకిల్‌పై వెళుతూ రోడ్డు దాటుతుండగా ప్రొద్దుటూరు వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్టు

కడప క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తాలుకా ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటరు రాజ్‌కుమార్ ఈనెల 7న ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇచ్చి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడు. ఈకేసుకు సంబంధించి మంగళవారం నిందితున్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి బోల్తా పడ్డ కారు



కాశినాయన సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వరికుంట్ల సమీపంలోగల జ్యోతి రోడ్డులో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కడప పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు కారులో జ్యోతి క్షేత్రానికి వెళ్లి కాశి నాయనను దర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమ ధ్యలో వరికుంట్ల గ్రామ సమీపంలోని ఊరబోడు వద్ద ఉన్న మలుపులో కారు అదుపుతప్పి పొలాల్లో బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న ముగ్గురిలో ఒకరికి స్వల్ప గాయాలైనట్లు తెలిసిం ది. ప్రమాదంలో కారు బాగా దెబ్బతింది. మద్యం తాగి వాహ నం నడపడంతో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ఇద్దరు పరారైనట్లు తెలిసింది.

వ్యవసాయ కూలీలకు భూపంపిణీ చేపట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షుడు విజయరాఘవన్



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షుడు విజయరాఘవన్

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాగు భూముల్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడంతో వ్యవసాయరంగం సంక్షోభంలోకి నెట్టబడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షుడు విజయరాఘవన్ అన్నారు. మంగళవారం కడప హరిత హోటల్ ఆవరణలో జాతీయ సమావేశాలలో మాట్లాడుతూ భూ పంపిణీ, సాగునీరు, ఉపాధి హామీ పనుల కోసం వ్యవసాయ కార్మికులు ఉద్యమించి పోరాడాలని పిలుపునిచ్చారు. పాలకులు విదేశీ పెట్టుబడులపై ఆధారపడి ఊహాజ నితమైన పథకాలతో భూములు సేకరించి వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారన్నారు. రైతులను, వ్యవసాయ కూలీలను అభద్రతకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. సాగు భూమి తగ్గడంతో వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లి గ్రామీణ ఉపాధి పడిపోయి వలసలు పెరుగుతున్నాయన్నారు. ఉపాధి లేక ప్రజల కొనుగోలు శక్తి తగ్గి పారిశ్రామిక ఉత్పత్తి పడిపోతుందన్నారు. భూమితో సహా ప్రకృతి సంపద కార్పొరేట్లపరం అవుతోందని... తద్వారా ఆర్థిక సామాజిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయని... బలవంతపు భూసేకరణ ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. సమావేశంలో అఖిల భారత రైతు సంఘం ప్రధాన కార్యదర్శి విజుకృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, ఉపాధ్యక్షుడు జి.చంద్ర శేఖర్, కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సీటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, జిల్లా ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ఆర్టీపీపీ సీఈకి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ కోరింది. ఈ మేరకు ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్‌కి ఏపీఎస్‌పీఈ జేఏసీ నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏపీ జెన్‌కో ఉద్యోగుల, కార్మికుల సమస్యలను వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వీటన్నింటిపై యాజమాన్యం తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల హక్కుల, సంక్షేమంపై ఉదాసీనత సరికాదన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'

పులివెందుల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అనుచితవ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నగరిగుట్టకు చెందిన ఓ వ్యక్తి హిందూ దేవుళ్లను కించపరు స్తూ మాటాడారన్నారు. మంగళవారం ఆ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి.. జరిగిన విషయాన్ని డీఎస్పీకి తెలియజేశామన్నారు. దీనికి డీఎస్పీ స్పందిస్తూ విచారణ చేసి... తప్పు జరిగినట్లు రుజువు అయితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి అండర్-19 జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపికలు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడతగా ఈనెల 11వ తేదీ గురువారం నుంచి 17 వరకు స్కూల్‌గేమ్స్ ఎంపికల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 అధ్యక్షుడు టీఎన్‌వీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం.చంద్రమోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాలికల కళాశాలలో నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల, ఫిజికల్ డైరెక్టర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రణాళికాబద్ధంగా షెడ్యూల్‌కు అనుగుణంగా ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనేలా చూడాలని కోరారు. ఈ నేపథ్యంలో కడప వైయస్‌ఆర్ క్రీడా పాఠశాలలో 11వ తేదీ మోడరన్ పెంథలాన్, స్విమ్మింగ్, పోటీలు జరుగుతాయని తెలిపారు.



ఏడుగురు జూదరుల అరెస్టు

కడప క్రైం, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఉక్కాయపల్లె డంపుయార్డు సమీపంలో జూదమాడుతున్న ఏడుగురిని చిన్నచౌకు పోలీసులు అరెస్టు చేశారు. కడపకు చెందిన ఏడుగురు జూదమాడుతుండగా అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.75వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

కూలీల ఆటో బోల్తా...ఇద్దరు మృతి

- నలుగురికి గాయాలు

చక్రాయపేట/తనకల్లు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూలి చేసుకుని వెళ్తున్న కష్టజీవుల ప్రయాణం విషాదాంతమైంది. రోడ్డు ప్రమాదం వారిని కబళించింది. కుటుంబాల్లో కన్నీళ్లు నింపింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి గ్రామ సమీపాన తుమ్మలవాండ్లపల్లి వద్ద మంగళవారం సాయంత్రం ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో కడప జిల్లా చక్రాయిపేట మండలం బురుజుపల్లికి చెందిన కూలీలు హేమలత (35), దేవనాథ్ (40) మృతి చెందారు. గంగులప్పకు తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా చక్రాయిపేట మండలంలోని కొండప్పగారిపల్లి, ఆంజనేయపురం, బురుజుపల్లి గ్రామాలకు చెందిన 22 మంది కూలీలు మండలంలోని అగ్రహారం పల్లి వద్దకు టమోటా తొలగింపు పనులకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయల్దేరారు. తుమ్మలవాండ్లపల్లి సమీపాన డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన వారిని తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హేమలత (35), దేవనాథ్ (40) మృతిచెందారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, శవాలను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దేవనాథ, హేమలత మృతదేహాలు



ప్రమాదానికి గురైన ఆటోను పరిశీలిస్తున్న పోలీసులు , ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిపోయిన కూలీల సామగ్రి

విజృంభిస్తున్న విషజ్వరాలు

- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- సాధారణ జ్వరాలే అంటున్న వైద్యులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో సేవలు

సుండుపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా రోగులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు బాధ పడుతున్నారు. మండల పరిధిలోని సుండుపల్లె, రాయవరం, బీజీ రాచపల్లిలో మూడు ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రాలుండగా, సుండుపల్లె పీహెచ్‌సీలో చిన్నపిల్లల వైద్యులు ఒకరు, జనరల్ వైద్యులు ఒకరు ఉన్నారు. రాయవరం వైద్యశాలలో ఒకరు, బీజీ రాచపల్లిలో ఒకరు చొప్పున వైద్యులు ఉన్నారు. ఆయా ఆసుపత్రులన్నీ ప్రస్తుతం రోగులతో కిటకిటలాడుతున్నాయి. కాగా, ప్రస్తుతం వైరల్ జ్వరాలు అధికంగా వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇవన్నీ సాధారణ జ్వరం కిందికే వస్తాయని, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసుకోకుండా ప్రభుత్వ వైద్యశాలల్లోనే మెరుగైన వైద్యాన్ని పొందాలని వైద్యులు కోరుతున్నారు. సుండుపల్లె వైద్యశాలలో రోజుకు 160 నుంచి 200 మంది వరకు రోగులు పలు రకాల సమస్యలపై సేవలు పొందుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. రాయవరం, బీజీ రాచపల్లి వైద్యశాలల్లోనూ రోగులు దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పుల సమస్యలతో వైద్యం పొందుతున్నట్లు చెబుతున్నారు. పీహెచ్‌సీల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నామని, అందుకు అవసరమైన మందులన్నీ ప్రభుత్వం సరఫరా చేసిందని వైద్యులు చెబుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి అనవసరంగా డబ్బు వృథా చేసుకోరాదని ప్రజలకు సూచిస్తున్నారు.


సుండుపల్లె వైద్యశాలలో వైద్యం కోసం వచ్చిన రోగులు

మెరుగైన వైద్య సేవలు


సుండుపల్లె ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాము. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వస్తున్నాయి. వైరల్ ఫీవర్ వస్తోంది. జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, జలుబు ఉన్నప్పుడు ఇంటికే పరిమితం కావడం మంచిది. చిన్నపిల్లలకు దూరంగా ఉండండి. దోమతెరలు తప్పనిసరిగా వాడండి. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోకుండా ప్రభుత్వ వైద్యం పొందడం మేలు.

- దిలీప్‌గుప్తా, చిన్నపిల్లల వైద్యుడు, సుండుపల్లె

13న లోక్‌అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భరత్‌కమల్

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జి భరత్‌కమల్ తెలిపారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలకు చెందిన పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చిన్నమండెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ నరసింహులుకు ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు దిబ్బల ఆంజనేయులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

సిద్దవటం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడ్డ వ్యక్తికి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వడం సంతోషకరమని మండల టీడీపీ అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన డాక్టర్ వీరభద్రుడు ఏపీ స్టేట్ నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులు కావడంతో మంగళవారం ఆయనను సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జీవో విడుదల చేయాలి

- ఆర్టీసీ ఈయూ ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య

రాయచోటిటౌన్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతుల కోసం ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామం అని, అధికారులు కూడా వెంటనే జీవో విడుదల చేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సుండుపల్లె రోడ్డులోని నారాయణ కల్యాణ మండపంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్ బాబు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు అనుమతులిచ్చినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చినా అధికారులు కాలయాపన చేస్తుండడంతో ఇప్పటికే 2 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెందిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర సహాయక కార్యదర్శి ప్రసాద్‌ఆబు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం విజయవంతం చేసేందుకు ఆర్టీసీ ఉద్యోగులు కష్టపడి పనిచేస్తున్నారన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి మాట్లాడుతూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని, ఆర్టీసీ ఉద్యోగులకు గతంలో ఉన్న రెఫరల్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జోనల్ నేతలు వీటీనాథ్, జీఎస్ మణ్యం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీ రమణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, జిల్లా కోశాధికారి కొండా ఈశ్వర్‌రెడ్డి, జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్ వీ. ప్రకాశ్, జిల్లా ప్రచార కార్యదర్శి చలమారెడ్డి, జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, ఎంఎస్ వాసులు, సుగుణ, సెల్వీ, మెయింటనెన్స్ కమిటీ మెంబర్ నరసింహులు, జిల్లాలోని ఐదు డిపోల నుండి వచ్చి ముఖ్య నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో సబ్‌కలెక్టర్ తనిఖీలు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఎరువుల దుకాణాలను రాజంపేట సబ్‌కలెక్టర్ భావన మంగళవారం తనిఖీ చేశారు. తహసీల్దారు యామినిరెడ్డి, మండల వ్యవసాయాధికారి మల్లికతో కలిసి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఎరువుల కొరత సృష్టిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం నిర్దేశించిన మేరకే విక్రయించాలని సూచించారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ భావన

మహిళా సంఘాలు బలోపేతం కావాలి


మహాసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్‌రెడ్డి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): మహిళా సంఘాల అభివృద్ధికి సభ్యులే మూలమని ఎంపీడీవో మల్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎం మల్లికార్జున రాజు మాట్లాడుతూ మహిళలు రుణాలు తీసుకుని ఉపాధి కల్పించుకోవాలన్నారు. ఉన్నతంగా ఎదగాలని ఆశ ఉంటే అవకాశాలు అవే వస్తాయని ముక్కావారిపల్లె కెనరాబ్యాంకు మేనేజర్ ప్రసాద్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం బాగుంటుందని జిల్లా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐబీడీపీఎం వేణు మాదవ్, ఐబీపీపీఎం ధర్మరాజు, శ్రీనిధి ఏజీఎం సంతోష్, ఏసీ, వైడీపీ ఏపీఎం రామచంద్ర, ఎల్‌సీసీసీలు శ్రీనివాసులు, హరిబాబు, మండల సీసీలు హరిబాబు, దామోదర్, గోవిందమ్మ, వెంకటసుబ్బమ్మ, అకౌంటెంట్ శివ, వీవో లీడర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

చిట్వేలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలు బడికి వచ్చేవిధం గా సీఆర్పీలు కృషి చేయాలని సెక్టోరియల్ అధికారి ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ వెంకట్రామయ్య సీఆర్పీలకు సూచించారు. మంగళవారం ఎంఈవోలు కోదండ నాయుడు, ఈశ్వర్యయ్యలతో కలిసి ఆయన పెద్దూరు ఎస్టీ కాలనీని సందర్శించి అక్కడ బడికి దూరంగా ఉన్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు.తల్లికి వందనం, విద్యా సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం చిట్వేలి ఎమ్మార్సీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనాథ్, విజయలక్ష్మీ, గంగాదేవి, సీఆర్పీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు రాయితీతో సూక్ష్మసేద్య పరికరాలు

రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): మైక్రో ఇరిగేషన్ పరికరాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీతో అందిస్తామని మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి సాయికిరణ్ తెలిపారు. మంగళవారం సంబేపల్లె మండలంలో గున్నికుంట్ల, శెట్టిపల్లి ప్రాంతాల్లో శ్రీసాయిరామ్ ప్లాస్టిక్ ఇరిగేషన్ కంపెనీ ఆధ్వర్యంలో రైతు సోదరులకు ఆటో వాహనం ద్వారా అవగాహన నిర్వహించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, మైక్రో ఇరిగేషన్‌తోనే లాభసాటి వ్యవసాయం సాధ్యపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం పోరాడితే కేసులా? : సీపీఎం

రాజంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ రైతుల పక్షాన పోరాడిన జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్‌ను బైండోవర్ చేయడం దారుణమని, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ల మణి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంటనే బైండోవర్‌ను ఉపసంహరించుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి బీమా అందజేత


శ్రీనివాసరాజు కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న జనసేన నేతలు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలోమృతి చెందిన జనసైనికుడు శ్రీనివాసరాజు కుటుంబ సభ్యులకు సోమవారం రాత్రి రూ.5 లక్షల బీమా చెక్కును జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్ అతికారి కృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యులందరికీ జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





పొలాలకు వెళ్లే దారిలో గోతులు తవ్వారు

- తహసీల్దారుకు రైతుల ఫిర్యాదు

సిద్దవటం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లే దారిలో గోతులు తవ్వి ఇబ్బందులు పెడుతున్నారని జ్యోతి గ్రామానికి చెందిన రైతులు మంగళవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 274/3లోని 18 లింకుల రహదారిలో గ్రామానికి చెందిన వ్యక్తి గోతులు తవ్వాడని, వాటిని పూడ్చివేసి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈ విషయమై ఇన్‌చార్జి వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


గోతులు తవ్విన ప్రాంతంలో రైతులు

యువతి ఆత్మహత్య

సిద్దవటం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతున్నావని తల్లిదండ్రులు మందలించారని ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండలంలోని టక్కోలి గ్రామానికి చెందిన వెంకటలక్షుమ్మ కూతురు తిరుపతమ్మ (17) పదో తరగతి వరకు చదువుకుని ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. కాగా, ఈ మధ్య కాలంలో సెల్‌ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం గమనించిన స్థానికులు మృతదేహాన్ని కిందకు దించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సమాజ సేవతో ప్రజలకు మేలు, పార్టీకి బలం

- మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

రాయచోటి టౌన్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా ప్రజలకు మేలు జరగడమే కాకుండా పార్టీ బలోపేతం అవుతుందని మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ మూడోసారి ప్రధానమంత్రి కావడమే కాకుండా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా జరుగుతున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల సాయి శుభ కల్యాణ మండపంలో సేవా పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా మాజీ ఎమ్మెల్యే కాపు రామ చంద్రారెడ్డి హాజరయ్యారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేశ్‌నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లి ప్రసాంత్, ఆనంద్ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటాలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని కోడూరు స్టూడెంట్స్ యూనియన్ ఫోర్స్ (కేఎస్‌యూఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు బండారు మల్లికార్జున తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరులోని గాంధీమహాత్ముని విగ్రహం వద్ద ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. అలాగే గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

11న ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల కేంద్రం, సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల కార్పొరేషన్ (ఎంఎస్‌ఎంఈ) ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు స్త్రీశక్తి భవన్‌లో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల ప్రమోషన్ అధికారి కే. నాగార్జున మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉపయోగాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు ఆధార్‌కార్డు, లింక్ మొబైల్ నెంబరు, పాన్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబరు, ఐఎస్ఎఫ్‌సీ కోడ్ నెంబరుతో పాటు అడ్రస్ తీసుకుని వస్తే రిజిస్ట్రేషన్ చేయిస్తామని వివరించారు.

అరటి, బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించాలి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అరటి, బొప్పాయిలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు లో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మదన్‌సాయి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బాధితులపై వివక్ష తగదని వీసీ ఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి సూచించారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో హెచ్ఐవీ, క్షయ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. క్షయవ్యాధి వచ్చిన వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలన్నారు. క్షయ వ్యాధి బాధితులకు ప్రతినెల ప్రభుత్వం రూ.1000 నగదు, మందులు ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు ప్రసాద్‌యాదవ్, రాంమోహన్, షారుద్దీన్, రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ విజయలక్ష్మి, ఏపీ సంపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

చిన్నమండెం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం కారణంగా ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఏఐటీయూసీ ఏపీ ఆటో డ్రైవర్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సెప్టెంబరు 16న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఆటోలను ఎఫ్‌సీ చేయించేందుకు వెళితే రాయచోటి ఆర్టీవో కార్యాలయంలో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, అలాంటివి మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ చిన్నమండెం నాయకులు రాజేశ్, ఆటో డ్రైవర్స్ రహంతుల్లా, వెంకట్రమణ, బాలు, అంజనేయులు, నాగముణి, మున్నా, నసీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేకోడూరులో ఆటో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో ఆటో కార్మికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరంతరాయంగా ఆటోలను నడిపినా కనీస అవసరాలకు తగిన ఆదాయం రావడం లేదన్నారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుంటే ఈ నెల 16న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు దేశయ్య, గంగయ్య, వెంకటసుబ్బయ్య, రమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం అందజేస్తున్న రాయల్ సేవా సమితి సభ్యులు

నందలూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులకు రాయల్ సేవాసమితి అధ్యక్షుడు గంగనపల్లె శ్రీనివాసులు మంగళవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముందుగా డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ మస్తానమ్మ గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి తగు జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గంధం గంగాధర్, పునగాని రాము యాదవ్, కలిశెట్టి భరత్, చంద్ర, లక్ష్మీకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి కుర్చీలు వితరణ

సుండుపల్లె, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్య పురంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం హెడ్‌కానిస్టేబుల్ బీడీ నాయక్ 25 కుర్చీలను అందజేశారని ఆలయ అర్చకుడు అమ్మ నాయక్ తెలిపారు. దీంతో ఆయనను శాలువాతో సత్కరించామన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

సమస్య పరిష్కరించాలని వినూత్న నిరసన

రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): తాను ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న రేకుల షెడ్డును మూడు నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కూల్చేశాడని, ఈ విషయంపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదంటూ సంబేపల్లెకు చెందిన భూషణం శ్రీనివాసులు అనే వ్యక్తి మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంచం వేసుకుని కూర్చుని వినూత్న పద్ధతిలో నిరసన తెలియజేశాడు. ఊతకర్ర ఉంటే తప్ప నడవలేని తాను మూడు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదని, తనకు న్యాయం చేసే వరకు ఇక్కడే పడుకుంటానని స్పష్టం చేశాడు. దీంతో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి కలుగజేసుకుని తక్షణమే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

స్వామిత్వ సర్వేను పూర్తి చేయండి: డీపీవో


గుర్రంకొండలో స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ రాధమ్మ

గుర్రంకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ సిబ్బందికి సూచించారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె, గుర్రంకొండ గ్రామాల్లో మంగళవారం స్వామిత్వ సర్వేను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించి వివరాలను సేకరించారు. ఇందులో భాగంగా టి.పసలవాండ్లపల్లె పంచాయతీ పరిధిలో స్వామిత్వ సర్వే తీరు సరిగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై మండిపడ్డారు. పట్టణంలో సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని, రోగాలు వ్యాపించ కుండా తగు జాగ్రత్తలను పాటించాలన్నారు. సచివాలయాల సిబ్బంది విధులపట్ల ఆలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శులు శ్రీహరి, నిస్సార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులతో దురుసుగా ప్రవర్తించొద్దు

● డీఎంహెచ్‌వో నాగరాజు


పి.కొత్తపల్లె పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సిద్దవటం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని కడప డీఎంహెచ్‌వో నాగరాజు సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డు కలిగి ఉండాలని, డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. కాన్పులవార్డు, రోగుల గదులు, వ్యాక్సినేషన్ సంబంధించిన గదులను తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్య పరిరక్షణపై పంచాయతీ కార్యదర్శులకు శ్రద్ధ తీసుకునేలా చూడాలన్నారు. 104 శిబిరాలకు వచ్చే పేషంట్ల రక్త నమూనాలు సేకరించాలని, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రంగలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మట్టి తరలింపు అనుమతులు నిషేధం

● ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు

కురబలకోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువుల నుంచి మట్టి తరలింపుపై అనుమతులను నిషేధించినట్లు ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కనున్న రియల్ ఎస్టేట్ భూముల అభివృద్ధికి వ్యవసాయ భూముల పేరుతో మట్టి తరలింపులో ఇరిగేషన్ అధికారులను బురిడీ కొట్టించి అనుమతులను పొంది చింతమాకులపల్లె పంచాయతీ నార్లపల్లె చెరువు నుంచి మట్టిని తరలించిన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతిలో మట్టి మాఫియా బరితెగింపు, మట్టి తరలింపులో బురిడీ శీర్షికన కథనాలు ప్రచురితమైంది. కాగా దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలో చెరువులను నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో చెరువుల నుంచి మట్టిని తోలుకోవడానికి అనుమతులను రద్దు చేశామన్నారు. నార్లపల్లె చెరువులో మట్టిని తోలుకోవడానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు.

టపాసులు పేలి టీ కొట్టుకు నిప్పు

వీరబల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు వీరబల్లికి విచ్చేసిన సందర్భంగా స్థానిక బస్టాండు ఆవరణలో నేతలు టపాసులు పేల్చారు. దీంతో నిప్పు రవ్వలు ఎగసి పడడంతో టీ కొట్టు 60 శాతానికి పైగా కాలిపోయింది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కాగా, ఈ ప్రమాదంతో జీవనాధారం కోల్పోయానని, తనను ఆదుకోవాలని టీకొట్టు యజమాని కరీముల్లా కోరుతున్నాడు.

టమోటా నారు... నెల దాటితే నేలపాలు


నెల దాటడంతో పడేసిన టమోటా నారు

● నారు నర్సరీలపై అకాలవర్షాల ప్రభావం

● లబోదిబోమంటున్న నర్సరీల యాజమాన్యం

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట సాగులో ఆధునిక పద్ధతిలో రెడీమేడ్ విధానాన్ని అందించేవి నారు నర్సరీలు. నర్సరీలలో ప్రధానంగా టమోటా, వంగ, మిరప నారు పిలకలతో పాటు పూల మొక్కల బంతి, చామంతి మొక్కలు పెంచుతూ ఉంటారు. అయితే జిల్లాలో ప్రధానంగా రాయచోటి, తంబళ్లపల్లి, మదనపల్లె, పీలేరు, కలికిరి నియోజకవర్గంలో టమోటా సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. ఒకప్పుడు టమోటా పంట సాగు కోసం రైతులు నారుమళ్లు తయారు చేసి విత్తనాలు పోసి నారుమడి చుట్టూ పాత చీరలతో కట్టి చుట్టూ ఎత్తయిన రాళ్లతో, టెంకాయ పట్టలతో పందిరి వేసేవారు. 30 నుంచి 45 రోజుల పాటు ప్రతిరోజూ నీరు పోసి నారు సిద్ధం చేసుకునేవారు. దీంతో చాలా ఆలస్యమయ్యేది. అయితే వ్యవసాయంలో మార్పులు రావడంతో నారు నర్సరీలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. సులువైన పద్ధతిలో పంటసాగు జరుగుతుంది. నారు పోసిన తర్వాత మొక్కకు నెల దాటితే అమ్ముడుపోని నారు నేలపాలు కావాల్సిందే అంటున్నారు నర్సరీ యజమానులు. వర్షాలు సకాలంలో కురిస్తేనే నర్సరీల యజమానులకు ఆదాయం ఉంటుందని, లేదంటే నష్టాలు తప్పవని అంటున్నారు. టమోటా నారు ఒక్కో పిలకపై రూ.55 పైసల నుంచి 65 పైసల ఖర్చు వస్తున్నట్లు తెలిపారు. ఒక పిలక ఒక్క రూపాయి అమ్మితే రూ.35 నుంచి 45 పైసలు ఆదాయం వస్తుందని నర్సరీల యజమానులు చెబుతున్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు పడకపోవడంతో నారు ముదిరి నేలపాలు చేసినట్లు తెలిపారు. ఒక నారు నర్సరీని బట్టి ఒక నెలలో రూ.8 నుంచి 9 లక్షలు టమోటా నారు వస్తున్నట్లు తెలిపారు. నష్టం రావడంతో లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.


నారు నర్సరీలో సిద్ధంగా ఉన్న టమోటా నారు

ఏడాదికి రెండుసార్లు సాగు

ఈ ప్రాంతంలో రైతులు ఏడాదిలో రెండుసార్లు టమోటా పంట సాగు చేస్తారు. మార్చి, ఏప్రిల్ నుంచి ఎండాకాలం వస్తే చాలు.. రాయచోటి నియోజకవర్గం ప్రాంతంలో కలకడ, సంబేపల్లె, చిన్నమండెం ప్రాంతాలకు చెందిన రైతులు ఎండ తీవ్రతలు అధికంగా ఉండడంతో పంట సాగు కోసం భాకరాపేట, మదనపల్లి, అంగళ్లు, బి.కొత్తకోట ప్రాంతాలకు వెళ్లి పొలం లీజుకు తీసుకుని పంట సాగు చేస్తారు. జూన్, జూలై నెల ఆఖరిలో వర్షాలు పడడంతో అక్కడ పంట పూర్తి చేసుకుని తిరిగి ఇక్కడ జూలై, ఆగస్టు నెలలో పంట సాగులకు సిద్ధం చేస్తారు. ఇలా ఏడాదిలో రెండుసార్లు పంట సాగు చేస్తూ నారు నర్సరీలపై ఆధారపడడంతో నారు నర్సరీ యజమానులకు వ్యాపారం జీవనాధారంగా మారింది.

టమోటా ధరల పతనంతో తగ్గిన సాగు

టమోటా సాగుపై ధరల ప్రభావం పడింది. రాయచోటి నియోజకవర్గంలో సుమారు 2 వేల హెక్టార్లలో టమోటా సాగు చేసేవారు. టమోటా ధరలు వరుసగా 7 నెలలుగా పడిపోవడంతో రైతులు పంట సాగుకు సుముఖత చూపకపోవడంతో పంట సాగు తగ్గిందనే చెప్పవచ్చు. దీంతో కూడా నారు నర్సరీ వ్యాపారంపై ప్రభావం పడింది.

ఈ ఏడాదీ నష్టమే

- సుబ్రమణ్యం, నారు నర్సరీ వ్యాపారి, దేవపట్ల, సంబేపల్లె మండలం



మా నర్సరీలో ఒకసారి 8 లక్షల టమోటా నారు వేస్తాం. ఈ ఏడాది ఒకసారి మాత్రమే నారు అమ్ముడు పోయింది. గతంలో ఏడాదికి రెండుసార్లు నారు అమ్ముడు పోయేది. జూన్, జూలై నెలల్లో వర్షాలు పడకపోవడంతో నారు అమ్ముడుపోలేదు. నారుకు నెల దాటితే ముదిరిపోతుంది. తర్వాత పడేయాల్సిందే. దీంతో నష్టమే. ఉద్యానశాఖ అధికారులు నర్సరీ యజమానులు నష్టాలను గుర్తించి ఆదుకోవాలి.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

● గ్రామ పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య


పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

పీలేరురూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాసి వెంకట్రామయ్య ఆరోపించారు. మంగళవారం పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలు గడుపుతున్న 46 మంది పంచాయతీ పారిశుధ్య కార్మికుల జీతాల్లో నెలకు రూ. 1000 చొప్పున తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. ఏవరూ చేయని పని చేస్తున్న కార్మికుల కడుపు కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే రూ. 13,500లలో రూ. వెయ్యి తగ్గిస్తే ఏమి తినాలి ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇదే విషయం డీపీఓ రాధమ్మ దృష్టికి తీసుకెళ్లగా ఇలా ఎవరు చేయమన్నారని ప్రశ్నించారని తెలిపారు. అయినా పంచాయతీ అధికారుల్లో ఎటువంటి చలనం కానరావడం లేదని తెలిపారు. గతేడాది ఏప్రిల్, మే నెలల జీతాలు 46 మంది కార్మికులకు ఇవ్వాలని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. ఇంకెప్పుడిస్తారో అంతా అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. ప్రతి నెలా పంచాయతీ కార్మికులను 300 గ్రాముల కొబ్బరి నూనె, రెండు సోపులు ఇస్తారని, ఎనిమిది నెలలుగా నూనె, సోపులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఒక్కొక్కరి పీఎఫ్ ఖాతాలో ఆరు నెలల డబ్బు జమ చేయకుండా పెండింగ్ పెట్టారని, వీటిని ఎప్పుడు జమచేస్తారో ఎవరిని అడిగినా సరైన సమాధానం చెప్పడంలేదని వాపోయారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభించడం శోచనీయమని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించకపోతే తమ ఆందోళన కార్యక్రమాలను అందరి సంఘీబావంతో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్మికులకు 2025-2026కు యూనిఫాం సత్వరం ఇవ్వాలని ఏప్రిల్‌లో పంచాయతీ బోర్డు ఆమోదం తెలిపినా ఇప్పటి వరకూ ఇవ్వలేదన్నారు. మూడు పూటలూ గడవడం గగనమైన పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన నూనె, సోపులు, దుస్తులు, పెండింగ్ జీతాలు, పీఎఫ్ తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు బీ.వీ.రమణ, పులి రెడ్డెప్ప, నాగార్జున, రమేష్, చిట్టెమ్మ, రాణెమ్మ, రాజేశ్వరి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యం సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగా పదోన్నతులు

కలికిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం పొన్నూలు కొత్తపల్లె పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ జె.ప్రవీణ్ కుమార్‌కు కంటి వైద్యం సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతి కల్పించారు. కడప ఎన్‌పీసీబీ సంచార కంటి వైద్యం యూనిట్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డీపీఎంఓగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.రియాజ్‌బేగ్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా పదోన్నతి కల్పించి చిత్తూరు జిల్లా వైద్యశాలకు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

12న అండర్-19 ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 12వ తేదీన శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 ఫుట్‌బాల్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు నాగరాజ, ఝాన్సీ, డాక్టర్ బాబు, సరిత, కిషోర్, భార్గవి తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆరో తరగతి నుంచి ఇంటర్ మధ్య చదువుతుండాలన్నారు. 2007 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. తమ వెంట ఇంటర్ చదువుతున్న వారు టెన్త్ ఒరిజనల్ సర్టిఫికెట్లు, క్రీడా యూనిఫామ్స్‌తో సెలక్షన్‌లో పాల్గొనాలని సూచించారు.

ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్‌ఓగా సునీల్

కలికిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అటవీ శాఖ సబ్ డీఎఫ్‌ఓగా గరుడ్ సాంకేత్ సునీల్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2023 ఐఎఫ్‌ఎస్ అధికారి అయిన సాంకేత్ శిక్షణ ముగించుకోవడంతో ఆయనను ప్రొద్దుటూరులో నియమించారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాళీశ్వరస్వామి కొండలో క్లూస్ టీమ్


ఆలయ ముఖద్వారం పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

రామసముద్రం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె గ్రామ పంచాయతీ బల్లసముద్రం వాళీశ్వర స్వామి కొండలో మంగళవారం మదనపల్లె క్లూస్ టీమ్ పోలీస్ అధికారులు వేలిముద్రలు, ఆధారాలను సేకరించారు. వాళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం గుప్తనిధుల కోసం ఆలయాన్ని ధ్వంసం చేసిన సంగతి విధితమే. ఆలయ అర్చకులు లోకనాథ్ దీక్షిత్, ఈఓ రమణ, పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పందించిన రామసముద్రం ఎస్‌ఐ రమేష్ బాబు ఆదేశాలతో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించడానికి వచ్చి కొండలో అణువు అణువు పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, అర్చకులు లోకనాథ్ దీక్షితులు, కానిస్టేబుల్ పురుషోత్తం, నల్లప్పగారి పల్లె గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భూములను సద్వినియోగం చేసుకోండి


దేవదాయశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న బి.కొత్తకోట నేతలు

బి.కొత్తకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల గంగమ్మ మాన్యం భూములను సద్వినియోగం చేసుకొని ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా దేవదాయశాఖ అధికారులకు బి.కొత్తకోట బీజేపీ నేతలు విన్నవించారు. మంగళవారం జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన వీరు మాట్లాడుతూ పట్టణంలోని బెంగళూరు రోడ్డులో రూ.కోట్ల విలువైన వాణిజ్య భూములను ఏళ్ల తరబడి గంపగుత్తగా నామమాత్రపు అద్దెకు ఇచ్చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ ముకుందబాబు, రమేష్, మురళి, రాము, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అధిక యూరియా పంటకు అనర్థం

● జిల్లా వ్యవసాయాధికారి శివన్నారాయణ


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివన్నారాయణ తదితరులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరితో పాటు ఏ పంటకైనా అధిక మోతాదులో యూరియా వినియోగం అనర్థదాయకమని జిల్లా సంచాలకులు శివన్నారాయణ పేర్కొన్నారు. మంగళవారం కోటావూరు గ్రామంలో తోటి అధికారులతో కలిసి పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. యూరియా అధికమోతాదుతో నేలలో క్షార శాతం పెరిగిపోతుందని, భూమి నిస్సారం అవుతుందన్నారు. దానికి బదులు సంప్రదాయ పద్ధతులను అవలంభించి, సారవంతమైన ఎరువులను ఉపయోగించి, రసాయన ఎరువుల వాడకాన్ని క్రమక్రమంగా తగ్గించాలన్నారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకుల్లో పంటరుణాలు ఇచ్చి తీరాలని, అలా కాకుండా ఏ బ్యాంకు శాఖలోనైనా ఇవ్వకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మనుషుల ఆధార్ లాగే పశువులకు కూడా గుర్తింపుకార్డును ఇస్తున్నామని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ రాయితీలను పొందాలన్నారు. పలువురు రైతులు తమ సమస్యలను జిల్లా అధికారులకు వన్నవించారు. కార్యక్రమంలో బి.కొత్తకోట ఏఓ చంద్రశేఖర్, సచివాలయాల వ్యవసాయశాఖ ఉద్యోగులు మల్లికార్జున, అంజి, సునీత తదితరులు పాల్గొన్నారు.

చెప్పిందే కొలత.. పల్లెవాసి కలత

● సర్వేయర్లు లేకుండా స్వామిత్వ కార్యక్రమం

● సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

● ఇప్పటికే జరుగుతున్న సర్వే


సర్వేయర్ లేకుండా కొలతలు తీస్తున్న పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్

సుండుపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ శాతం గ్రామాల్లో ఇప్పటికీ తమ నివాసాలకు ఆస్తి పత్రాలు లేక, కొలతలు తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను చక్కదిద్దేందుకు స్వామిత్వ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్, ఇంజనీరింగ్, డిజిటల్ సహాయకులు బృందంగా వెళ్లి సర్వే చేపట్టాలి. కానీ సుండుపల్లె మండలంలో ప్రస్తుతం జరుగుతున్న స్వామిత్వ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే వెళ్లి సర్వే చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో లోపభూయిష్టంగా జరుగుతున్నట్లు గ్రామీణులు ఆరోపిస్తున్నారు.


కొలతల పూర్తి వివరాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి

రోవర్లు ఉపయోగించకుండా

ప్రధానంగా ఇళ్ల స్థలాలకు కొలతలు వేసే సమయంలో రోవర్లు ఉపయోగించాలి. అవి లేకుండా ప్రక్రియ సాగుతోంది. టేపులతో కొలతల వల్ల తమ ఆస్తులకు సంబంధించి తేడాలు వస్తాయని పలువురు చెబుతున్నారు. వీఆర్‌వోలు ఇతర పనుల పేరుతో సరిగ్గా హాజరుకాకపోవడం, అసలు సర్వేయర్లు కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో ఖాళీ స్థలాలకు హద్దులు తెలియక ఇంటి యజమాని ఏది చెబితే అదే పరిగణలోకి తీసుకుంటున్నారు. దాంతో గ్రామాల్లో వివాదాలు తెలెత్తే అవకాశాలు ఉన్నాయి. సుండుపల్లె, పెద్దినేనికాలువ, చిన్నగొల్లపల్లి, పొలిమేరపల్లె, భాగంపల్లితో పాటు మరికొన్ని గ్రామ పంచాయతీల్లో స్వామిత్వ సర్వే జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి లోపాలు సవరించి సర్వే సక్రమంగా సర్వేయర్లతో జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అనుభవం లేని వారికి బాధ్యతలు

కేంద్రం పంచాయతీరాజ్‌శాఖ పల్లెల్లో స్వామిత్వ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పథకానికి సంబంధించి ఇంటింటా కొలతలు వేయాలన్నా, రికార్డుల్లో నమోదు చేయాలన్నా సర్వేయర్ పాత్రే కీలకం. అలాంటి వారు లేకుండా అనుభవం లేని గ్రామ సహాయక ఇంజనీర్లకు బాధ్యతలను అప్పగించారు. దాంతో కొలతలు తీయడంలో లోపాలు తలెత్తుతున్నాయి. కొందరు అనుభవం ఉన్న సర్వేయర్లను పక్కన బెట్టారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో సాగాల్సిన అభివృద్ధి పనుల్లో నిమగ్నం కావాల్సిన ఇంజనీరింగ్ సహాయకులు ఆ పనులను పక్కనబెట్టి అనుభవం లేని సర్వే పనులకు వెళ్తున్నారు. దాంతో పనులు ఆగిపోతున్నాయని పీఆర్ అధికారులు లబోదిబోమంటున్నారు.

సమస్య వస్తేనే సర్వేయర్లు

- రాధమ్మ, డీపీవో

సమస్య వస్తే సర్వేయర్లు వచ్చి కొలిచి సమస్య పరిష్కరిస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు వచ్చి పొడవు, వెడల్పు నమోదు చేస్తున్నారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాము.

కోడిగాండ్లపల్లెలో విజృంభిస్తున్న విషజ్వరాలు


కోడిగాండ్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న గండికోట బ్యాక్‌వాటర్

- ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసినా.. అదుపులోకి రాని వైనం
- కర్నూలు, తాడిపత్రి, ప్రొద్దుటూరు ఆసుపత్రుల్లో చికిత్స
- గండికోట బ్యాక్‌వాటర్‌తోనే సమస్య

ముద్దనూరు సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోడిగాండ్లపల్లెలో విషజ్వరాలు రోజు రోజుకు విజృంభిస్తున్నాయి. వైద్యాధికారులు గ్రామంలో పర్యటించి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన జ్వరాలు అదుపు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ గ్రామంలో 20 రోజులుగా విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. దాదాపు 30 నుంచి 40 మంది పిల్లలు జ్వరాల బారిన పడ్డారు. 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఎక్కువగా జ్వరాలు వస్తున్నాయి. చాలా మంది పిల్లలకు రక్త కణాలు తగ్గిపోతుండటంతో డెంగ్యూ జ్వరాలు వస్తు న్నాయి. దీంతో కొందరు ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, మరికొందరు కర్నూలు, ప్రొద్దుటూరు, తాడిపత్రిలలోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. కాగా, గత కొద్ది రోజుల నుంచి గ్రామంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో, మలేరియా అధికారులు, మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నా జ్వరాలు అదుపు చేయలేని పరిస్థితులు ఉన్నాయి. గండికోట బ్యాక్ వాటర్ గ్రామానికి అతీసమీపంలో ఉండటంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలతో పాటు వైద్యాధికారులు చెబు తున్నారు. కొద్ది రోజుల క్రితం ఓ చిన్నారి విషజ్వరంతో మృతి చెందినట్లు ప్రజలు చెబుతున్నారు. గ్రామంలో ఉన్నతాధికారులు పర్యటించి తమను జ్వరాల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాక్‌వాటర్‌తోనే సమస్య

మాగ్రామం సమీపంలో గండికోట డ్యాం బ్యాక్‌వాటర్ నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. పిల్లలకు దోమలు కుట్టడంతో జ్వరాలు వస్తున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలి.
మోనిక, కోడిగాండ్లపల్లె



ఏడుగురికి డెంగ్యూ

కోడిగాండ్లపల్లెలో విషజ్వరాలు ఉన్నాయి. 13మంది తీవ్రజ్వరంతో బాధపడుతున్నారు. పరీక్షలు చేయగా ఏడుగురికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. తాడిపత్రి, కర్నూలు ప్రాంతాల్లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇద్దరు రికవరీ అయ్యారు. గ్రామానికి అతిసమీపంలో గండికోట బ్యాక్ వాటర్ నిల్వ ఉంది. గ్రామంలో నీటి తొట్టెలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండటం వల్ల లార్వా చేరుతుంది. పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచనలు ఇచ్చాం. మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నాం.

-గీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో




ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి

పదోన్నతుల జీవో విడుదల చేయాలి

- ఆర్టీసీ ఈయూ ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య

రాయచోటిటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతుల కోసం ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామం అని, అధికారులు కూడా వెంటనే జీవో విడుదల చేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సుండుపల్లె రోడ్డులోని నారాయణ కల్యాణ మండపంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్ బాబు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల కు అనుమతులిచ్చినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చినా అధికారులు కాలయాపన చేస్తుండడంతో ఇప్పటికే 2 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెందిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర సహాయక కార్యదర్శి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం విజయవంతం చేసేందుకు ఆర్టీసీ ఉద్యోగులు కష్టపడి పనిచేస్తున్నా రన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి మాట్లాడుతూ ఎంప్లా యీస్ హెల్త్ స్కీమ్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని, ఆర్టీసీ ఉద్యోగులకు గతంలో ఉన్న రెఫరల్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని డిమాడ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జోనల్ నేతలు వీటీనాథ్, జీఎస్ మణ్యం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీ రమణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, జిల్లా కోశాధికారి కొండా ఈశ్వర్‌రెడ్డి, జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్ వీ. ప్రకాశ్, జిల్లా ప్రచార కార్యదర్శి చలమారెడ్డి, జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, ఎంఎస్ వాసులు, సుగుణ, సెల్వీ, మెయింటనెన్స్ కమిటీ మెంబర్ నరసింహులు, జిల్లాలోని ఐదు డిపోల నుండి వచ్చి ముఖ్య నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేంపల్లె షరీఫ్‌కు కీర్తిపురస్కారం



వేంపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెకు చెందిన కథారచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారగ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్‌కు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 23,24 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు కీర్తి పురస్కారాన్ని అందుకోనున్నారు. జుమ్మా, టోపీజబ్బార్, చారల పిల్లి వంటి కథలు రాయగా వివిధ భాషల్లో తర్జుమా జరిగాయి. ఆకు పచ్చముగ్గు కథ డిగ్రీలో పాఠ్యాంశంగా చేర్చారు. ప్రతిభను గుర్తించి ఈ పురస్కారం ప్రకటించడం పట్ల షరీఫ్ సంతోషం వ్యక్తం చేశారు.

11న ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల కేంద్రం, సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల కార్పొరేషన్ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు స్త్రీశక్తి భవన్‌లో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల ప్రమోషన్ అధికారి కే. నాగార్జున మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉపయోగాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు ఆధార్‌కార్డు, లింక్ మొబైల్ నెంబరు, పాన్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబరు, ఐఎస్ఎఫ్‌సీ కోడ్ నెంబరుతో పాటు అడ్రస్ తీసుకుని వస్తే రిజిస్ట్రేషన్ చేయిస్తామని వివరించారు.

అరటి, బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించాలి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అరటి, బొప్పాయిలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్ డి మాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరులో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మదన్‌సాయి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పరు ఢీకొని యువకుడి మృతి



ఖాజీపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో స్కూటర్‌ను టిప్పర్ ఢీకొన్న సంఘటనలో కె.వెంకటసుబ్బయ్య (21) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అల్లాడుపల్లె వద్ద జరుగుతున్న ఐటీఐ నిర్మాణ పనుల కోసం నాగసానిపల్లె నుంచి మట్టి తీసుకెళ్లేందుకు వస్తున్న టిప్పర్ అయ్యప్పస్వామి గుడి సమీపంలోకి రాగానే స్కూటర్‌ను ఢీకొంది. దీంతో వెంకటసుబ్బయ్య బ్రిడ్జిపై నుంచి కింద పడటంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే సిబ్బంది రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతను చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

లారీ ఢీకొని వృద్ధుడు...

చాపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద మైదుకూరు-ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లెక్కల లక్ష్మిరెడ్డి (64) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సోమాపురం గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి మైదుకూరు నుంచి సోమాపురానికి మోటారు సైకిల్‌పై వెళుతూ రోడ్డు దాటుతుండగా ప్రొద్దుటూరు వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్టు

కడప క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తాలుకా ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... తాలుకా పోలీ సు స్టేషన్ పరిధిలోని రౌడీషీటరు రాజ్‌కుమార్ ఈనెల 7న ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇచ్చి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడు. ఈకేసుకు సంబంధించి మంగళవారం నిందితున్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి బోల్తా పడ్డ కారు



కాశినాయన సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వరికుంట్ల సమీపంలోగల జ్యోతి రోడ్డులో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కడప పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు కారులో జ్యోతి క్షేత్రానికి వెళ్లి కాశి నాయనను దర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమ ధ్యలో వరికుంట్ల గ్రామ సమీపంలోని ఊరబోడు వద్ద ఉన్న మలుపులో కారు అదుపుతప్పి పొలాల్లో బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న ముగ్గురిలో ఒకరికి స్వల్ప గాయాలైనట్లు తెలిసిం ది. ప్రమాదంలో కారు బాగా దెబ్బతింది. మద్యం తాగి వాహ నం నడపడంతో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ఇద్దరు పరారైనట్లు తెలిసింది.

వ్యవసాయ కూలీలకు భూపంపిణీ చేపట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం

అఖిలభారత అధ్యక్షుడు విజయరాఘవన్


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షుడు విజయరాఘవన్

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాగు భూముల్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడంతో వ్యవసాయరంగం సంక్షోభంలోకి నెట్టబడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షుడు విజయరాఘవన్ అన్నారు. మంగళవారం కడప హరిత హోటల్ ఆవరణలో జాతీయ సమావేశాలలో మాట్లాడుతూ భూ పంపిణీ, సాగునీరు, ఉపాధి హామీ పనుల కోసం వ్యవసాయ కార్మికులు ఉద్యమించి పోరాడాలని పిలుపునిచ్చారు. పాలకులు విదేశీ పెట్టుబడులపై ఆధారపడి ఊహాజ నితమైన పథకాలతో భూములు సేకరించి వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారన్నారు. రైతులను, వ్యవసాయ కూలీలను అభద్రతకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. సాగు భూమి తగ్గడంతో వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లి గ్రామీణ ఉపాధి పడిపోయి వలసలు పెరుగుతున్నాయన్నారు. ఉపాధి లేక ప్రజల కొనుగోలు శక్తి తగ్గి పారిశ్రామిక ఉత్పత్తి పడిపోతుందన్నారు. భూమితో సహా ప్రకృతి సంపద కార్పొరేట్లపరం అవుతోందని... తద్వారా ఆర్థిక సామాజిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయని... బలవంతపు భూసేకరణ ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. సమావేశంలో అఖిల భారత రైతు సంఘం ప్రధాన కార్యదర్శి విజుకృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, ఉపాధ్యక్షుడు జి.చంద్ర శేఖర్, కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, జిల్లా ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ఆర్టీపీపీ సీఈకి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ కోరింది. ఈ మేరకు ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్‌కి ఏపీఎస్‌పీఈ జేఏసీ నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏపీ జెన్‌కో ఉద్యోగుల, కార్మికుల సమస్యలను వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వీటన్నింటిపై యాజమాన్యం తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల హక్కుల, సంక్షేమంపై ఉదాసీనత సరికాదన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'

పులివెందుల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అనుచితవ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నగరిగుట్టకు చెందిన ఓ వ్యక్తి హిందూ దేవుళ్లను కించపరు స్తూ మాటాడారన్నారు. మంగళవారం ఆ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి.. జరిగిన విషయాన్ని డీఎస్పీకి తెలియజేశామన్నారు. దీనికి డీఎస్పీ స్పందిస్తూ విచారణ చేసి... తప్పు జరిగినట్లు రుజువు అయితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి అండర్-19 జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపికలు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడతగా ఈనెల 11వ తేదీ గురువారం నుంచి 17 వరకు స్కూల్‌గేమ్స్ ఎంపికల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 అధ్యక్షుడు టీఎన్‌వీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం.చంద్రమోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాలికల కళాశాలలో నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల, ఫిజికల్ డైరెక్టర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రణాళికాబద్ధంగా షెడ్యూల్‌కు అనుగుణంగా ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనేలా చూడాలని కోరారు. ఈ నేపథ్యంలో కడప వైయస్‌ఆర్ క్రీడా పాఠశాలలో 11వ తేదీ మోడరన్ పెంథలాన్, స్విమ్మింగ్, పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

కడప క్రైం, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఉక్కాయపల్లె డంపుయార్డు సమీపంలో జూదమాడుతున్న ఏడుగురిని చిన్నచౌకు పోలీసులు అరెస్టు చేశారు. కడపకు చెందిన ఏడుగురు జూదమాడుతుండగా అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.75వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

కొమ్మినేని శ్రీవిద్యకు గోల్డ్‌మెడల్


గవర్నర్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కొమ్మినేని శ్రీవిద్య

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్, ప్రముఖ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొమ్మినేని వెంకటసుబ్బయ్య కుమార్తె కొమ్మినేని శ్రీవిద్య ఎమ్మెస్ ఈఎన్‌టీలో రాష్ట్రస్థాయి ప్రథమర్యాంకు సాధించారు. మూడు బంగారు పతకాలు, అవార్డులు కూడా సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె కడప రిమ్స్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా కొనసాగుతున్నారు. మంగళవారం విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో వార్షికోత్సవం పురస్కరించుకొని గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా మూడు గోల్డ్‌మెడల్స్, రెండు ప్రజెంటేషన్స్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్‌చాన్సెలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్ వేమిరెడ్డి పాల్గొన్నారు. కొమ్మినేని శ్రీవిద్య గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల బండి బాబుమూర్తి, బాలకృష్ణ, బండారు సత్య, అప్పిశెట్టి వెంకటేశ్వర్లు, పీఎస్ ఇంతియాజ్, అహ్మద్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

కూలీల ఆటో బోల్తా...ఇద్దరు మృతి

- నలుగురికి గాయాలు

చక్రాయపేట/తనకల్లు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూలి చేసుకుని వెళ్తున్న కష్టజీవుల ప్రయాణం విషాదాంతమైంది. రోడ్డు ప్రమాదం వారిని కబళించింది. కుటుంబాల్లో కన్నీళ్లు నింపింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి గ్రామ సమీపాన తుమ్మలవాండ్లపల్లి వద్ద మంగళవారం సాయంత్రం ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో కడప జిల్లా చక్రాయిపేట మండలం బురుజుపల్లికి చెందిన కూలీలు హేమలత (35), దేవనాథ్ (40) మృతి చెందారు. గంగులప్పకు తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా చక్రాయిపేట మండలంలోని కొండప్పగారిపల్లి, ఆంజనేయపురం, బురుజుపల్లి గ్రామాలకు చెందిన 22 మంది కూలీలు మండలంలోని అగ్రహారం పల్లి వద్దకు టమోటా తొలగింపు పనులకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయల్దేరారు. తుమ్మలవాండ్లపల్లి సమీపాన డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన వారిని తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హేమలత (35), దేవనాథ్ (40) మృతిచెందారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, శవాలను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దేవనాథ, హేమలత మృతదేహాలు



ప్రమాదానికి గురైన ఆటోను పరిశీలిస్తున్న పోలీసులు , ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిపోయిన కూలీల సామగ్రి

తగినంత యూరియాను ఉంచుతాం



సంపతికోటలో రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు తగినంత యూరియాను అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి ప్రేమలత అన్నారు. రాపూరివాండ్లపల్లె, సంపతికోట రైతుసేవా కేంద్రాల్లో జిల్లా అధికారులు, తహసీల్దార్ శ్రీరాములు నాయక్ అధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఈక్రాప్ సర్టిఫికెట్, ఆధార్, పాసుపుస్తకం అందచేసి యూరియాను పొందాలన్నారు. రాపూరి వాండ్లపల్లెలో 222 బస్తాలు, సంపతికోటలో 222 బస్తాలను రైతులకు అందించామన్నారు. జిల్లా అధికారులు మాట్లాడుతూ పశుగ్రాసం సాగుకు రైతులు నానో యూరియా పిచికారీ చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. రైతుసేవా కేంద్రాలకు యూరియాను సరఫరా చేస్తామని రైతులకు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరైనా యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ చిన్నరెడ్డెప్ప, జిల్లా వ్యవసాయాధికారి జి. శివన్నారాయణ, లీడ్ బ్యాంకు మేనేజర్ అంజనేయులు, మదనపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్. రమేష్, సంపతికోట కిట్టన్న, మాజీ సర్పంచ్ కేశవ తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు అవరణలో ఉన్న గంగమ్మను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు జోలపాలెం కరుణాకర్ నాయకుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు పర్యవేక్షించారు.

వినండహో...



దండోరా కొడుతున్న శ్రీరాములు (ఫైల్ ఫొటో)

గ్రామాల్లో సమాచార సాధనం తప్పెట ● ఎక్కడా కన్పించని వైనం ● సంప్రదాయాన్ని కబళించిన సాంకేతిక విప్లవం

ములకలచెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'గ్రామ ప్రజలకు తెలియజేయడం ఏమనగా రేపు మన ఊరు స్టోర్‌లో బియ్యం...చక్కెర కందిపప్పు, కిరసనాయిల్ ఇస్తారు. తెల్లకార్డు ఉన్న వారంతా వచ్చి సరుకులు తీసుకెళ్లాలని తహసీల్దారు చెబుతున్నారహో....!'

'గ్రామ మహాజనులారా...! రేపు మనూరికి ఎమ్మార్వో, ఎండీఓ సార్లు వస్తున్నారు. సమస్యలు ఉంటే రేపు పొద్దున 11 గంటలకు పంచాయతీ ఆఫీసుకు వచ్చి అర్జీలు ఇచ్చుకోవాలి.'

'పక్కనున్న అనంతపురం జిల్లా తనకల్లు మండలంలో కలరా సోకిందహో. ప్రజలందరూ చేతులు బాగా కడుక్కుని అన్నం తినాలని, జాగ్రత్తగా ఉండాలని ఎమ్మార్వో సారు తెలిపారహో..!' అంటూ గతంలో పల్లెల్లో దండోరా (చాటింపు) వేసేవారు. రెండు దశాబ్దాల కిందట గ్రామంలో ఏ చిన్న ప్రభుత్వ కార్యక్రమం చేయాలన్నా అందరికీ సమాచారం తెలియజేయాలంటే దండోరా వేయాల్సిందే. చివరికి బ్యాంకు తనఖా సొమ్ము వేలం విషయం సైతం దండోరా వేయించేవారు. కోర్టు పనులకు సైతం తప్పెటతో దండోరా వేయించారా అంటూ అడిగే వారు. నిత్యావసర సరుకులు వచ్చినా... పంపిణీ జరగాలన్నా... అంటువ్యాధులు ప్రబలినా... ప్రతి కూల పరిస్థితులు ఏర్పడినా... ఇంటి పన్ను, భూమి శిస్తు చెల్లించాలన్నా... కరెంటు బిల్లుల చెల్లింపులు, హరికథలు... తోలుబొమ్మలాటలు... సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నా దండోరా ద్వారానే సమాచారం చేర వేసేవారు. చదువురాని వారికి సైతం సమాచారం అర్థమయ్యేది. పెరిగిన సాంకేతిక విప్లవంలో దండోరా కాలగర్భంలో కలిసిపోయింది. దండోరా వేయడం అంతరించిపోవడంతో వాటిపై ఆధారపడ్డ కుటుంబాలు ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మళ్లాయి.

దండోరా శబ్దం విన్పిస్తే చాలు....

గ్రామాల్లో దండోరా శబ్దం వస్తే చాలు ఎంతో ఆసక్తిగా వినేవారు. ఏమి చెబుతున్నాడోనని ఆసక్తిగా వినే వారు. ఇళ్లలో పిల్లలు అల్లరి చేసినా, శబ్దాలు చేసినా అరిచేవారు. మళ్లీ దండోరా వేసే వ్యక్తి వద్దకు వెళ్లి అడిగి తెలుసుకునేవారు.

దండోరా అధికారిక సమాచారం



ఆ రోజుల్లో ఏ సమాచారం తెలియజేయాలన్నా దండోరా అధికారక సమాచారం. తప్పెట ద్వారా దండోరా వేసే వ్యక్తులు వీధుల్లోకి వస్తే ఆసక్తిగా వినేవాళ్లం. ఇప్పుడు సమాచారం సెల్‌ఫోన్లకు పంపుతున్నాం అంటారు. మాలాంటి పమయానికి సమాచారం తెలియడం లేదు.

మహబూబ్‌బాషా, ములకలచెరువు

సాంకేతిక విప్లవంతో....

సాంకేతిక విప్లవంతో ప్రస్తుతం గ్రామాల్లో జరిగే కార్యక్రమాల సమాచారం సెల్‌ఫోన్లకు వస్తోంది. పల్లెల్లో ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలు ఏవి జరిగినా సెల్‌ఫోన్లకు సమాచారం వస్తుడడంతో నిమిషాల్లో తెలిసిపోతోంది. సెల్‌ఫోన్ల వినియోగం పెరగడంతో ఫోన్లకే సమాచారం అందిస్తున్నారు. పల్లెల్లో జరిగే కార్యాక్రమాలను ఒక రోజు ముందే సెల్‌ఫోన్లకు పంపుతున్నారు.

శబ్దం వినిపిస్తే చాలు....



దండోరా శబ్దం వినిపిస్తే చాలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి వినేవాళ్లం. ఏం జరుగుతోందో దండోరా వేసే వరకూ తెలిసేది కాదు. ఇప్పుడు ఏ సమాచారమైనా సెల్‌ఫోన్లకు వస్తోంది. మీ టింగులు జరిగినా, అధికారులు వస్తున్నా క్షణాల్లో తెలిసిపోతోంది. సెల్‌ఫోన్లు రావడంతో దండోరా కనుమరుగైంది.

నారాయణ, గూడుపల్లె

'నానో'తో అధిక దిగుబడులు

అందుబాటులో కావలసినంత యూరియా : ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న సతీష్‌కుమార్, వ్యవసాయ అధికారులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల రైతులు నానో(లిక్విడ్) యూరియా వాడితే అధిక దిగుబడులు సాధ్యమని మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ సూచించారు. మంగళవారం బండ్లపై పంచాయతీలో వరి పైరుకు నానో యూరియాను పిచికారీ చేసే విధానాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రైతులు ఎక్కువగా నానో(లిక్విడ్) యూరియా కాకుండా మామూలు యూరియాను వాడడంతో డిమాండ్ పెరిగిందన్నారు. రైతులకు కావల్సినంత యూరియాను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నానో(లిక్విడ్) యూరియా తగినంత నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించేందుకు వారి మందే పిచికారీ చేసి చూపించారు. యూరియాపై రైతులు అపోహలు చెందవద్దని ప్రతి రైతుకు అందజేస్తామన్నారు. నిర్ణీత ధర కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ సహాయకులు, ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ, ఏఓ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో కావలసినంత యూరియా

కలికిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన మేరకు యూరియాను మంగళవారం నుంచి అందుబాటులో వుంచారు. మొదటి విడతగా మర్రికుంటపల్లె, గుండ్లూరు సచివాలయ పరిధి రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. ఒక్కో రైతు సేవా కేంద్రంలో 10 టన్నుల వంతున యూరియాను అందుబాటులో వుంచినట్లు ఎంఏఓ హేమలత చెప్పారు. బుధవారం నుంచి గుట్టపాలెం, కలికిరి-2 ఆర్‌ఎస్కేల్లో 10 టన్నుల వంతున విక్రయాలు చేపడతామన్నారు. గురువారం నుంచి పత్తేగడ, మునేళ్లపల్లె ఆర్‌ఎస్కేల్లో కూడా పదేసి టన్నుల వంతున స్టాకు అందుబాటులోకి రానుందని ఆమె తెలిపారు. బస్తా యూరియాను రూ.266లకు మాత్రమే విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులందరికీ అవసరమైన మేరకు యూరియాను పంపిణీ చేస్తామని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం మర్రికుంటపల్లెలో సర్పంచు రెడ్డిరాము, తహసీల్దారు హరికుమార్‌తో కలిసి ఆమె యూరియా పంపి ణీని ప్రారంభించారు.

నానో వాడకం పెంచాలి

రైతులు కాలక్రమేణ నానో యూరియా వాడకంపై దృష్టి సారించాలని తహసీలారు హరికుమార్, ఎంఏఓ హేమలత అన్నారు. మంగళవారం మర్రికుంటపల్లె సచివాలయం వద్ద జరిగిన రైతు అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ నానో యూరియా, జీవన ఎరువుల వినియోగంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. పంటనుబట్టి అవసరమైన మేరకు యూరియా వాడాలని వివరించారు. మార్కెట్లో అందుబాటులో వున్న నానో యూరియా, నానో డీఏపీలు ఉపయోగిస్తే పంటలకు సమపాళ్లలో పోషకాలు లభిస్తాయని ఆయన వివరించారు.

కార్యక్రమంలో సర్పంచు రెడ్డిరాము, ఏఈఓ ఇంద్ర, వీఆర్వో సురేష్‌కుమార్ రెడ్డి, ఆర్‌ఎస్కే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త మంత్రి గిరిధర్‌రెడ్డి చెక్కులను అందజేశారు. 40 మందికి రూ.33లక్షల మేరకు చెక్కులను అందజేశారు. మాజీ సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, టీడీపీ నేతలు మూగి రవిచంద్ర, శ్రీనాధరెడ్డి, చాంద్ బాషా, కట్టా హరినాథ్, ఫజులు, దయ్యాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం



విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ గురువును మించిన దైవం లేదని ప్రతి ఉపాధ్యాయుడు ఆదర్శవంతంగా నిలవాలన్నారు. పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పుతూ తమదైన శైలిలో భావిభారత పౌరులుగా తీర్చి దిద్దాలని, తద్వారా ఉపాధ్యాయ వృత్తికి నిజమైన గౌరవం, గుర్తింపు, సార్థకత చేకూరుతాయన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మనోహర్‌రాజు, ఎంఈఓలు వెంకటరత్నం, వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు బాలాజి, నాగరాజు, బసంత్, సిద్దయ్య, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా టీబీ నిర్ధారణ పరీక్షలు



టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీబీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ సూచించారు. టీబీ చికిత్స పొందుతున్న వారితో సన్నిహితంగా వుండేవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, పొగ, మద్యపానం అలవాట్లున్న వారు, క్యాన్సర్, డయాలసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు లోనైనవారు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా ప్రభుత్వ వైద్యశాలల్లో పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని నిర్వహించిన సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్నపాటి పరీక్షలతో టీబీ లక్షణాలున్న విషయాన్ని గుర్తించవచ్చన్నారు. అనంతరం 80 మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డీహెచ్ఈఓ మహ్మద్ రఫీ, మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కావ్యగంధ, సూపర్‌వైజర్లు నాగిరెడ్డి, సుధాకర్, వైద్య సిబ్బంది షాహీనా, చంద్రుప్రియ, గీత, పావని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీజేపీతో వైసీపీ బంధం బహిర్గతం'

మదనపల్లె, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ ఏకపక్షంగా మద్దతు ఇవ్వడంతో బీజేపీతో వైసీపీకి ఉన్న బంధం ఏమిటో అర్థమైందని హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్ పేర్కొన్నారు. బీజేపీకి తాము వ్యతిరేకమని బయట చెప్పుకోవడమే తప్ప అంతర్గతంగా పార్టీతో పూర్తి సంబంధాలు పెట్టుకున్న ఏకైక పార్టీ వైసీపీ అని అన్నారు. నమ్మకంతో ఓటు వేసిన ముస్లిం సమాజాన్ని మోసం చేసిన వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి, ముస్లింలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్‌ది ద్రోహం, ద్వంద్వ వైఖరి, ఇక్కడ ప్రజలకు ఒకటి చెప్పి, ఢిల్లీలో బీజేపీకి మోకరిల్లి మద్దతు ఇవ్వడాన్ని మానుకోవాలని ఆయన సూచించారు. ఢిల్లీలో పూర్తి మెజారిటీ ఉన్నా వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక హోదా సాధించలేకపోవడం, ప్రతి బిల్లుకూ బీజేపీకి మద్దతు ఇస్తూ, ముస్లిం సమాజాన్ని మోసగిస్తున్న వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెబుతారని హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ అన్నారు.

యూరియా పంపిణీ చేయండి

పెద్దమండ్యం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా పంపిణీ చేయాలని తహసీల్దార్ తేజశ్వి వ్యవసాయ సహాయకులకు సూచించారు. పెద్దమండ్యం రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆమె మాట్లాడుతూ పంటలకు తగిన మోతాదులో యూరియా వాడలన్నారు. పశుగ్రాసం సాగులో యూరియా తగ్గించాలన్నారు. ఎంపీఈఓ అనుదీప్, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీలకు 15వ ఫైనాన్స్ నిధులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో వున్న పది గ్రామ పంచాయతీలకు 15వ ఫైనాన్స్ నిధులు రూ.6కోట్ల 68లక్షలు మంజూరైట్లు ఎంపీడీఓ రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మంజూరైన నిధులను సంబంధిత గ్రామ పంచాయతుల్లో పని చేసే అంబుడ్స్‌మెన్, కార్మికులకు పెండిగ్ జీతాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పంచాయతీల్లో విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశధ్య పనులకు ఉపయోగించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆక్రమణలపై విచారించండి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, చుట్టుపక్కల వున్న చెరువులు, వంక స్థలాల ఆక్రమణలపై విచారించి చర్యలు తీసుకోవాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ కోరారు. మంగళవారం స్థానిక జలవనరులశాఖ ఈఈ సురేష్‌బాబును కలిసిన ఆయన మాట్లాడుతూ చెరువులు, వాటి మొరవలు ఆక్రమణలతో పంటలకు సాగునీరు అందడం లేదన్నారు. పట్టణంలోని కోమటివానిచెరువు, అమ్మచెరువులు ఆక్రమణలకు గురైనా అధికారులు పట్టించుకోలేదన్నారు. చెరువుల కింద బఫర్ జోన్‌లలో కూడా ఐదంతస్తుల భవనాల నిర్మించారన్నారు. వీటన్నింటిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నేతలు జిలానీబాషా, శశికుమార్, వినయ్, ద్వారక పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

బి.కొత్తకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాలుర జడ్పీహైస్కూల్‌లో రేపటినుంచి రెండురోజుల పాటు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, మోడల్‌స్కూల్, కస్తూర్బా, గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నారు. అండర్14, 17 క్యాటగిరీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్‌బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం ఈనెల 15న అథ్లెటిక్స్ పోటీలు జరపనున్నారు. ఈ పోటీల నిర్వహణపై సంబంధిత అధికారులు మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంఈఓ-2 భీమేశ్వరాచారి, ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి తాజ్‌బాషా, రాజేశ్వరి, భువనేశ్వరి పాల్గొన్నారు.

కొత్త మంచూరు జడ్పీ హైస్కూల్‌లో...

వాల్మీకిపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొత్త మంచూరు జడ్పీ హైస్కూల్‌లో 11 నుంచి రెండు రోజుల పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించన్నట్లు పాఠశాల హెచ్ఎం ప్రకాష్ ప్రకటించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, బాడ్మింటన్(షటిల్), అథ్లెటిక్స్, యోగా, తదితర పోటీలు నిర్వహిస్తారన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరూ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

నూతన బోరులో పుష్కలంగా నీరు



నూతన బోరు వద్ద టీడీపీ నేతలు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ఇట్నేనివారి పల్లె వద్ద గల వినాయకనగర్ హౌసింగ్ లే అవుట్‌లో తాగు నీటి కోసం మంగళవారం వేసిన బోరులో పుష్కలంగా నీరు పడింది. ఎంతో కాలంగా వేధిస్తున్న నీటి సమస్యకు పరిష్కారం లభించింది. చాలా కాలంగా కాలనీ వాసులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. నీటి సమస్యతో లే ఔవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంలో లబ్ధిదారులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ నీటి సమస్యను కాలనీ వాసులు స్థానిక టీడీపీ నేతల ద్వారా టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్ కుమార్ నూతన బోరుకు పాయింట్ పెట్టించారు. టీడీపీ నేతలు అధికారులతో కలసి నూతన బోరు డ్రిల్లింగ్ చేపట్టారు. బోరులో పుష్కలంగా నీరు పడడంతో కాలనీ వాసుల నీటి సమస్య తీరింది. పైపు లైన్ వేసి కాలనీకి నీటిని సరఫరా చేస్తామని ఏఈ వినోద్ తెలిపారు. తెలుగు యువత నేతలు నరసింహులు, వికలాంగుల అధ్యక్షుడు రామాంజులు, మునాఫ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వాల్మీకిపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారులు జులేఖాబేగం, సాయిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం ఆస్పత్రిలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గర్భంలో ఉన్న పిండం లింగ నిర్ధారణ తెలుసుకోవడం చట్టరీత్యా నేరమని దీనికి సహకరించిన మహిళలు, వైద్యులు, కుటుంబ సభ్యులు, ప్రోత్సహించిన వారికి సైతం జరిమానా, జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు. పౌష్టికాహారంపై కూడా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. గర్భిణులు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే కాన్పు సులభతరం, తల్లిలో పాల ఉత్పత్తి బాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ, సీహెచ్‌ఓ అరుణ, సూపర్‌వైజర్ బానుబీ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బండకిందతండాలో తాగునీటి ఎద్దడి నివారణ

పెద్దమండ్యం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బండకింద తండాలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలను అధికారులు చేపట్టారు. వారం రోజులుగా తండాలో తాగునీటి ఎద్దడి నెల కొందని గ్రామస్తులు ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ దృష్టికి తెచ్చారు. తరచూ బోరు మోటార్ కాలిపోతుండడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. స్పందించిన అధికారులు తాగునీటి పథకం బోరుకు కొత్త బోరు మోటార్ అమర్చి గ్రామంలో తాగునీరు సరఫరా చేశారు. దీంతో తండాలో తాగునీటి సమస్య తీరిందని అధికారులు వెల్లడించారు. సర్పంచ్ శిరిష, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎరువుల ధరలను నియంత్రించాలి

కలకడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థిక కుంగుబాటుకు కారణమవుతున్న ఎరువుల ధరలను నియంత్రించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సోమశేఖర్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. మంగళవారం కలకడలో పార్టీ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేసిన ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత ఏర్పడడంతో వ్యవసాయానికి తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక అప్పుల పాలవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. నేతలు బాష, మల్లికా, హిదాయతుల్లా, షమీర్, మస్తాన్‌రెడ్డి, ఆదినారాయణ, రాజా, తిరుమలేష్, మహేష్, గిరి పాల్గొన్నారు.

అర్హులైన గ్రూపులకు బ్యాంకు లింకేజీ రుణాలు



సీసీలతో మాట్లాడుతున్న డీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హత కలిగిన అన్ని డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ.. గతేడాది ఉన్నతి రుణాలు తీసుకున్న వారి నుంచి వంద శాతం తిరిగి చెల్లించేలా సీసీలు చొరవ చూపాలన్నారు. అన్ని గ్రూపులు, బ్యాంకు అధికారులతో సమావేశాలు నిర్వహించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి సంఘాలకు రుణాలు ఇవ్వాలన్నారు. గ్రూపులు మరింత పటిష్టంగా నిర్వహించేలా సీసీలు, సంఘమిత్రలు, గ్రూపు సభ్యులకు సహకరించాలన్నారు. సమావేశంలో ఏపీఎం గంగాధర్, జిల్లా ఉన్నతి ఏపీఎం రమేష్, సీసీలు పాల్గొన్నారు.

అంకిత భావంతో వైద్యసేవలు అందించాలి

పెద్దమండ్యం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) ప్రజలకు వైద్య సేవలు అంకిత భావంతో అందించాలని డాక్టర్ ఇమ్మానుయేల్ పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం పీహెచ్‌సీ నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన డాక్టర్ ఇమ్మానూయేల్, సీహెచ్‌ఓ క్రిష్ణయ్య వైద్య సిబ్బందిని సన్మానించారు. పెద్దమండ్యం వైద్యాధికారులు అశోక్, హరివర్మ, మహబూబ్‌బాష, సీహెచ్‌వో మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి



వరి సాగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కలకడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని ఎంపీడీఓ భాను ప్రసాద్ రైతులకు సూచించారు. ఎనుగొండపాళెం పంచాయతీ దిగువపాళెంలో సేంద్రీయ ఎరువులు, నానో యూరియా వాడకంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన వరిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి జయచంద్ర, వీపీఏ పాల్గొన్నారు.

చెత్తకుప్పలు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెత్తకుప్పలు తొలగిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనవాసాల నడుమ దుర్గంధం వెదజల్లుతున్న చెత్త కుప్పలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పడకేసిన పారిశుద్ధ్యం' కథనానికి స్పందన లభించింది. ఇందిరానగర్, యల్లమంద క్రాస్ తదితర ప్రాంతాల్లో చెత్తకుప్పలను తొలగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పీలేరులో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో అనిశ్చితి నెలకొంది. దీనిపై ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్ స్పందించి ఇళ్ల మధ్య ఉన్న చెత్తాచెదారం తొలగించి, మురుగునీటి కాల్వలను శుభ్రం చేయించారు.